## తాగునీటికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోండి

- మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈఈ

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

పానగల్ 59ఎంఎల్‌డీ ప్లాంట్,నల్గొండ లోని పంప్ హౌస్‌లో పైపులైన్ మరమత్తుల కోసం మంగళవారం నీటి సరఫరా నిలిపివేసినట్టు నార్కట్‌పల్లి మిషన్ భగీరథ సబ్‌డివిజన్ ఏఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల నార్కట్ పల్లి, చిట్యాల, రామ్మన్న పేట, కట్టంగుర్ మండలాల్లోని 132 ఆవాసాలకు మంచి నీటి సరఫరా ఉండదు. కావున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.


# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
# నల్లగొండ
బుధవారం | ఫిబ్రవరి 12, 2025 | www.navatelangana.com


నల్గొండ జిల్లా బిజెపిలో చిచ్చు రగులుతోంది పార్టీ నాయకుల్లో అసమ్మతి సెగ రాజుకుంది. జిల్లా అధ్యక్ష పదవి ఎంపికల్లో నిబంధనలను పాటించలేదని కార్యకర్తలు, శ్రేణులు గుర్తుపట్టని నాయకుడికి అధ్యక్ష పదవి ఇవ్వడం ఏమిటని కార్యకర్తలు, శ్రేణులు అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారు. దీంతో జిల్లా కమలం పార్టీ రెండుగా చీలి పోయి అసమ్మతి సెగ రోజు రోజుకు పెరిగిపోతుంది. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎదుటనే కషాయం పార్టీ శ్రేణులు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఆ పార్టీ అధిష్టానం కూడా చొరవ చూపకపోవడంతో బిజెపి పార్టీలో రెండు వర్గాలుగా చీలిపోయి ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కింది స్థాయి కార్యకర్తలు శ్రేణుల్లో పార్టీ పరిస్థితిపై అయోమయం నెలకొంది.

- రెండు గ్రూపులుగా చీలిన బీజేపీ
- కేంద్ర సహాయ మంత్రి ఎదుటనే నిరసన
- సఖ్యతకు చొరవ చూపని అధిష్టానం
- క్షేత్రస్థాయిలో కాషాయ శ్రేణుల్లో అయోమయం



# కమలంలో చిచ్చు..

## చెలరేగిన అసమ్మతి సెగ

నవతెలంగాణ-మిర్యాలగూడ

బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి ఎన్నిక ఆ పార్టీలో దుమారం చెలరేగింది. పార్టీ నిబంధనలను నిర్ణయించిన అధిష్టానమే సంస్థాగత నిబంధనలకు విరుద్ధంగా రెండోసారి నాగం వర్షిత్ రెడ్డికి అధ్యక్ష పదవి ఇవ్వడంతో పార్టీలో అసమ్మతి చెలరేగింది. ఏడాది క్రితం పార్టీలోకి వచ్చి పార్టీలో ఎలాంటి క్రియాశీలక సభ్యత్వం లేకపోయినా పార్టీలో బూత్ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఎలాంటి పదవి నిర్వహించకపోయిన నేరుగా జిల్లా అధ్యక్షునిగా నియమించడంపై పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. రెండు సార్లు క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండి 45 ఏళ్లు పైబడి ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా వర్షిత్ రెడ్డికి జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారని,అలా ఎలా ఇస్తారని ఆ నిర్ణయాన్ని పున: పరిశీలించాలని అసమ్మతి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**సుదీర్ఘకాలంగా పనిచేసిన దక్కని పదవులు**

కమలం పార్టీలో క్షేత్రస్థాయి నుండి పనిచేసిన వారికే పదవులు ఇస్తారని కిందిస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు నాయకులు చెప్పుకొస్తుంటారు. కానీ జిల్లా అధ్యక్ష పదవి విషయంలో మాత్రం అలా జరగలేదు. ఎన్నో ఏండ్లుగా సుదీర్ఘకాలంగా పాటు పార్టీని నమ్ముకొని కార్యకర్తలు నుండి పనిచేసినప్పటికీ పదవులు దక్కకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.

**కేంద్ర సహాయ మంత్రి ఎదుటనే నిరసన**

బీజేపీలో చెలరేగిన అసమ్మతి నాయకులు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎదుటనే నిరసన తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఈ నెల 9న ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎదుట ఆ పార్టీ జిల్లా నాయకుడు బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కార్యాలయం ఆవరణలో నెల పై బైటాయించి నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్ష పదవి ఎంపికలో నిబంధనలు పాటించలేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా జిల్లా అధ్యక్షునిగా వర్షిత్ రెడ్డిని నియమించారని ఆరోపించారు. వర్షిత్ రెడ్డి నియామకాన్ని ముందు నుంచే వ్యతిరేకిస్తున్నామని, జిల్లాలోని ఆయా ప్రాంతాలలో క్రియాశీలక నాయకులు సైతం వ్యతిరేకిస్తున్నారని ఈ విషయం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ నిర్ణయం పై అధిష్టానానికి వివరించి పున: సమీక్షించి అధ్యక్షున్ని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. వర్క్ షాప్ లో జిల్లా అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్న బండారు ప్రసాద్ తో పాటు మాధగోని శ్రీనివాస్ గౌడ్, వీరారెడ్డి, శ్రీదేవి రెడ్డి, కడగంచ రమేష్ పిల్లి రామరాజు యాదవ్ తూటుపల్లి రవీందర్ వంగూరి రాఖి పోతిపాక సాంబయ్యలు హాజరు కాలేదు. ఇంత చేసిన అధిష్టానం స్పందించకపోవడం శోచనీయం.

**అయోమయంలో కమలం శ్రేణులు**

వాటి జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో జరిగిన అసమ్మతి కిందిస్థాయి క్యాడర్లో అయోమయం కలిగిస్తుంది. మొదటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న కార్యకర్తలు పార్టీ నాయకుల పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో సభ్యత్వం తీసుకోవాలన్న క్రమశిక్షణ కార్యకర్తగా ఉండడంతోపాటు ఆర్ఎస్ఎస్ లో నిబద్ధతగల కార్యకర్తగా పనిచేసి ఉండాలి. పార్టీ ఇచ్చిన పిలుపులను తూచా తప్పకుండా అమలు చేయాలి. ఆ తర్వాతనే పార్టీలో క్రియాశీలక సభ్యత్వం ఇస్తారు. జిల్లా అధ్యక్ష పదవికి పొందాలంటే తప్పనిసరిగా క్రియాశీలకంగా రెండుసార్లు సభ్యత్వం తీసుకుని ఉండాలి. జిల్లాస్థాయిలో ప్రధాన కార్యదర్శిగా రాష్ట్రస్థాయిలో ఒక పదవి చేసి ఉండాలి. కచ్చితంగా వయస్సు 45 ఏండ్లు పైబడి ఉండడం వంటి నిబంధన పార్టీలో ఉంది. అలా కాకుండా గతేడాది పార్టీలోకి వచ్చి కనీసం క్రియాశీలక సభ్యత్వం లేని వర్షిత్ రెడ్డికి జిల్లా అధ్యక్ష పదవి రెండోసారి ఇవ్వడం పట్ల పార్టీ శ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాటిలో క్రియాశీలకంగా పనిచేస్తున్న పదిమంది ప్రధాన నాయకులు ఈ ఎన్నికను వ్యతిరేకిస్తూ అసమతి గళం విప్పుతున్నారు. వీరి వెంట జిల్లాలోని కార్యకర్తలు ,ముఖ్య నాయకులు నడుస్తున్నారు. అధ్యక్షుని నియామకంపై నిరసన చేస్తున్నా అధిష్టానం పట్టించుకోకపోవడంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. తాము పార్టీలో కొనసాగాలా వద్దా అని ప్రశ్న కూడా తలెత్తుతుంది.

**భవిష్యత్తులో కార్యచరణ రూపొందిస్తాం**
**బండారు ప్రసాద్,బీజేపీ సీనియర్ నాయకులు**

జిల్లా అధ్యక్ష పదవి విషయంలో రాష్ట్ర నాయకత్వం నిబంధనలను అమలు చేయలేదు. పార్టీ జాతీయ, రాష్ట్ర నిబంధనల ప్రకారం తప్పనిసరిగా రెండుసార్లు క్రియాశీలక సభ్యత్వం ఉండటంతో పాటు 45 ఏళ్ల పైబడి ఉండాలి. అలా కాకుండా గతేడాది పార్టీలోకి వచ్చిన వర్షిత్ రెడ్డిని రెండోసారి అధ్యక్షునిగా ఎంపిక చేయడం సరైనది కాదు. ఈ విషయంపై ఆనాటి నుంచి నేటి వరకు నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నాం. పార్టీ అధిష్టానం దృష్టి కూడా తీసుకెళ్లాం. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర నాయకుల ఎదుట నిరసనలు తెలిపి విషయాన్ని వివరించాం. అయినా అధిష్టానం నుంచి ఎలాంటి చర్యలు లేవు. పార్టీ ఇచ్చిన పిలుపులకు మేము దూరంగా ఉంటాం. ఇలాంటి పార్టీ కార్యక్రమాల్లో హాజరు కాము. వర్షిత్ రెడ్డిని అధ్యక్ష పదవి నుంచి దించేంతవరకు నిరసనలు చేస్తూనే ఉంటాం. అధిష్టానం స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

## శివన్నగూడ సొసైటీలో భారీ అవినీతి

- రూ.75 లక్షలు స్వాహా చేసిన సిబ్బంది
- రిటైర్డ్ ఉద్యోగే అసలు సూత్రధారి
- చైర్మెన్ ఫిర్యాదుతో అవినీతి బట్టబయలు
- ఆలస్యంగా వెలుగులోకి రికవరికి చర్యలు



నవతెలంగాణ-మర్రిగూడ

మండలంలోని శివన్నగూడ గ్రామంలో ఉన్న శివన్నగూడ రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్)లో 75 లక్షలా 50వేల భారీ అవినీతి బయటపడింది. సొసైటీ పరిధిలో కుదభక్షపల్లి, అంతంపేట, నామాపురం, మేటి చందాపురం, కొట్టాల, సరంపేట, లెంకలపల్లి, రాంరెడ్డి పల్లి, వెంకేపల్లి, దామెర భీమనపల్లి, నాంపల్లి మండలంలోని దామెర గ్రామపంచాయతీలు ఉన్నాయి.గత 50 ఏండ్లుగా పెద్ద సంఘంగా సొసైటీ పరిధిలోని రైతులకు ఈ సంఘం సేవలందిస్తుంది.2020-24 నాలుగేండ్ల కాలవ్యవధిలో సొసైటీలో భారీ అవినీతి వెలుగులోకి వచ్చింది. అందులో పనిచేసే ముగ్గురు ఉద్యోగులు పలుదఫాలుగా ఒకరు రూ.40 లక్షలు, ఇంకొకరు రూ.13 లక్షలు, మరొకరు రూ.12 లక్షల 50 వేలు డ్రా చేసుకొని తమ సొంత అవసరాలకు ఉపయోగించుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అన్ని డబ్బులు స్వాహా చేయడానికి కారణాలను వెతికే పనిలో ఉన్నత అధికారులు ఉన్నట్లు సమాచారం.ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరిగే పాలకవర్గ మీటింగులో సొసైటీ మొత్తం లావాదేవీలకు గురించి చర్చ పెడతారు.కానీ ఇంత పెద్ద స్కామ్ జరిగినా దీనిపై చర్చ ఎందుకు జరగలేదని రైతుల నుండి పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి.

**రిటైర్డ్ ఉద్యోగే అసలు సూత్రధారి**

శివన్నగూడ రైతు సేవా సహకార సంఘంలో ఒక ఉద్యోగి 30 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ ఉద్యోగి 2016 లోనే రిటైర్డ్ అయ్యాడు అయినా కూడా అతనికి 60 వేల రూపాయలు జీతం ఇచ్చుకుంటూ ఎందుకు కొనసాగిస్తున్నారనే విషయంపై ప్రస్తుతం చర్చ జరుగుతుంది.ఆ ఉద్యోగే 40 లక్షల రూపాయలు స్వాహా చేసినట్టు ఈ కుంభకోణంలో అతనే మొదటి సూత్రధారిగా ఆరోపణలు వస్తున్నాయి.

**చైర్మెన్ ఫిర్యాదుతో బట్టబయలు**

డీసీసీబీ జిల్లా అధికారికి ఈ కుంభకోణంపై సంఘం చైర్మెన్ ఫిర్యాదు చేయడంతో అవినీతి చిట్టా బయటపడింది.సొసైటీ లో పనిచేసే ముగ్గురు ఉద్యోగులే ఈ కుంభకోణానికి పాల్పడ్డారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.పాలకవర్గం సమయం ముగుస్తున్న క్రమంలో ఈ భారీ కుంభకోణం బయటపడడం,ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరిగే పాలకవర్గ సమావేశంలో సొసైటీ లావాదేవులు చర్చించడం జరుగుతుంది ఇంత అవినీతి జరిగినా ఎందుకు బయటకు పొక్క లేదని సొసైటీ పరిధిలోని రైతులు అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అవినీతి జరిగింది నిజమే**
**బాలం నరసింహ ,ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మెన్**



సొసైటీలో అవినీతి జరిగింది నిజమే.సొసైటీలో పని చేసే ముగ్గురు ఉద్యోగులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.దీనిపై నేను అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది.స్పందించిన అధికారులు ఆ ముగ్గురు వ్యక్తులకు షోకాజ్ నోటీసులు అందజేశారు.దఫాల వారీగా వారి నుండి పూర్తి మొత్తాన్ని రికవరీ చేసేటట్టు ఆదేశాలు జారీ చేశారు.అంతేకాకుండా 2020 ముందు కూడా సొసైటీలో ఏదైనా అవినీతి జరిగిందా అనే కోణంలో అధికారులు ఎంక్వయిరీ ప్రారంభించారు.

**అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి**
**ఏర్పుల యదయ్య, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి**



శివన్నగూడ రైతు సేవ సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన వారిపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి. పూర్తిస్థాయిలో రికవరీ చేపట్టి ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృత్తం కాకుండా చూడాలి. లేనిపక్షంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో సొసైటీ ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడ్తాం.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ - చండూరు



విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతోపాటు, మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారంస్థానిక బాలికల హాస్టల్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులు నుండి భోజనం పట్ల, ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సమయానుకూలంగా భోజనం అందించాలన్నారు. దోమలు లేకుండా, హాస్టల్ చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని కమిషనర్ ను ఆదేశించారు. ఇంతకుముందు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికగా తనిఖీ చేశారు. హాస్పిటల్ పరిసరాలను పరిశీలించారు. హాస్పిటల్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో భవనాన్ని పరిశీలించారు. కొత్త భవనాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రోగులకు సమయానుకూలంగా ఉండి వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. అక్కడి నుండి బోడెంగిపర్తిలో హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులు చక్కగా చదువు కోవాలని, పది పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మ్యాథమెటిక్స్ పై గట్టిగా ప్రయత్నం చేయాలన్నారు. కష్టంతో కాకుండా అన్ని సబ్జెక్టులు ఇష్టంతో చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో చండూర్ ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ దశరథ, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారమందించాలి

- ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి

నవతెలంగాణ-మునుగోడు




పిల్లలకు ఇవ్వాల్సిన మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ పీడీకృష్ణవేణి సూచించారు . బుధవారం మండలంలోని మునుగోడు 3, చీకటి మామిడి 1, వెల్మకన్న 1,2, గట్టుప్పల్ 1,2,3 సెంటర్స్ ను పరిశీలించారు . ప్రీస్కూల్ పిల్లల కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ కార్యక్రమాల నిర్వహణను గమనించారు. సర్వేలో ఉన్న ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రానికి హాజరయ్యేలా చూడాలని అన్నారు. మెనూ ప్రకారం వంట చేశారా లేదా అని పరిశీలించారు. బియ్యం, పప్పు, గుడ్లు నాణ్యతను పరిశీలించారు. ఎస్ హెచ్ టి ఎస్ పోషణ్ ట్రాకర్ యాప్‌లను పరిశీలించారు. పిల్లలకు అందించే బాలామృతం ప్లస్ తినిపిస్తున్నారా లేదా అని టీచర్ ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలలో టీచర్లు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట అసిస్టెంట్ డిపిఓ డి వెంకటమ్మ , సూపర్వైజర్లు ఎం శివేష , జె యాదమ్మ ,తదితరులు ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి

- నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య

నవతెలంగాణ-చిట్యాల



పథకాల పేరిట ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించాలని నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని గుండ్రంపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు రేషన్ కార్డులు ఇతర సంక్షేమ పథకాలు అందించాలనే ఆలోచన కంటే కోతలు పెట్టి ఎలా అందకుండా చేయాలనే దానిమీదనే ప్రభుత్వం దృష్టి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల వాగ్దానాలలో దేనికి స్పష్టత లేదన్నారు బీసీ ల కుల గణన తప్పుల తడకగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పును ఒప్పుకొని కులగణను మళ్ళీ నిర్వహించాలని, 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొలను వెంకటేష్ గౌడ్, పెద్ద కాపర్తి మాజీ సర్పంచ్ మర్రి జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితునికి ఆరు నెలల జైలు శిక్ష

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

బైక్ చోరీ కేసులో నిందితుడికి కోర్టు 6 నెలల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై రామ్మూర్తి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 10. 2024 తేదీన కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాద్ రోడ్ కిరాణం షాపు ముందు పార్క్ చేసిన బైకును కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన కొప్పుల గణేష్ చోరీ చేయడంతో విషయంపై దేవరకొండ పట్టణానికి చెందిన బాధితుడు సన్నగల్ల మల్లేష్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని గతేడాది అక్టోబర్ 22న నిందితున్ని పట్టుకొని రిమాండ్‌కు తరలించగా మంగళవారం దేవరకొండ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎస్ హరీష్ బాబు నిందితునికి దొంగతనం కేసులో ఆరు నెలల జైలు శిక్షతోపాటు వేయి రూపాయల జరిమానాలను విధించినట్లు తెలిపారు. నిందితున్ని ఆధారాలు సేకరించి పట్టుకొని కోర్టుకు అప్పజెప్పిన పోలీసులను సివిల్ జడ్జి అభినందించినట్లు తెలిపారు .

కడవరకు పేదల పక్షాన పోరాడిన వీరుడు

## జినుకుంట్ల లింగయ్య

**ఆయన మరణం సీపీఐ(ఎం) కు తీరని లోటు**
**నంద్యాల నర్సింహ రెడ్డి**

నవతెలంగాణ -క్లాక్ టవర్



చిన్ననాటి నుండి దోపిడీకి వ్యతిరేకంగా కడవరకు ఎర్రజెండా నాయకత్వాన పేదల పక్షాన పోరాడిన వీరుడు జినుకుంట్ల లింగయ్య అని, ఆయన మరణం సీపీఐ(ఎం) తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం కనగల్లు మండలం ధర్వేశిపురంలో సోమవారం రాత్రి అనారోగ్యంతో మరణించిన పార్టీజిల్లా సీనియర్ నాయకులు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ జినుకుంట్ల లింగయ్య పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ పార్టీ మండల కార్యదర్శి కానుగు లింగస్వామి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో నంద్యాల నరసింహారెడ్డి మాట్లాడుతూ కనగల్లు మండలంలో, నల్గొండ నియోజకవర్గంలో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా గీసే వాడికి చెట్టు కావాలని కామ్రేడ్ బైరు మల్లయ్య తో కలిసి అనేక ఉద్యమాలు నిర్వహించారని కొనియాడారు. వ్యవసాయ కార్మికుల కూలీ రేట్ల పెంపు కోసం, ఇళ్ల స్థలాలు, బంజరాయి భూముల పేదలకు పంపిణీ తదితర అంశాలపై అనేక ఉద్యమాలు నడిపారని కొనియాడారు. ధర్వేశిపురం గ్రామ సర్పంచిగా ఎన్నికై గ్రామాభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందించారన్నారు. వారి స్ఫూర్తితో నేటి యువత దోపిడీ లేని కష్టజీవుల రాజ్యం వచ్చేవరకు జరిగే పోరాటాల్లో ప్రజలంతా పాల్గొనడమే వారికి అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ,జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ,కార్యదర్శివర్గ సభ్యులు నారి ఐలయ్య సయ్యద్ హాశం, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, జిల్లా కమిటీ సభ్యులు ఎండి.సలీం, దండంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, కొండా అనురాధ, తుమ్మల పద్మ, దండెంపల్లి సరోజ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, దేవాదాయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి, నగేష్ గౌడ్ ,సిపిఐ నాయకులు జనుకుంట్ల సోమయ్య , లింగయ్య ఆంజనేయులు, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు పాములగుండ్ల అచ్చాలు . చనగోని సీతారాములు ,కొండా వెంకన్న , బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ కరీం పాషా మాజీ సర్పంచులు కడారి కృష్ణయ్య, సంజీవ ,వెంకట్ రెడ్డి ,మండల నాయకులు బ్రహ్మానందరెడ్డి , అక్రమ్ , సుల్తానా , సత్యనారాయణ, మాజీ ఎంపీపి నారబోయిన బిక్షం,రొట్టేల రమేష్,లి తదితరులు పాల్గొన్నారు.

## పశువుల దొంగల ముఠా అరెస్ట్

నవతెలంగాణ-కొండమల్లేపల్లి



ఆయా గ్రామాల్లో పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి దొంగల ముఠాను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామ్మూర్తి తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, గురజాల మండలం తాళ్లగడ్డ పులిపాడుకు చెందిన బొలెరో వాహనం డ్రైవర్ గుండబోయిన రామకృష్ణ , నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం షాద్నగర్కు చెందిన షేక్ యూసుఫ్ , పెదవురమండలం చలకుర్తి గ్రామానికి చెందిన పూల లక్ష్మణ్ కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. బొలెరో వాహనంలో రైతుల పొలాల వద్ద ఉన్నపశువులను గేదెలను దొంగిలించుకుపోయి వేరే ప్రాంతాలలో రైతులకు విక్రయిస్తున్నారు. జనవరి 22న మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన రైతు బొడ్డుపల్లి యాదయ్య పొలం వద్ద ఉన్న పశువుల కొట్టంలో రెండు ఆవులను కట్టేయగా అదే రాత్రి గుర్తు తెలియని దుండగులు దొంగిలించకుపోవడంతో రైతు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో మంగళవారం పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో నిందితులను పట్టుకున్నారు. వారి నుండి రూ.6 లక్షల విలువ చేసే ఏడు గేదెలు, రెండు ఆవులను రికవరీ చేసి రైతులకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకొని కేసు నమోదు చేసి కోర్టుకు డిమాండ్ చేసినట్లు తెలిపారు.

## కట్టలు తెంచే నిర్లక్ష్యం

- కాలువ కట్టలకు పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

నవతెలంగాణ-వేములపల్లి





నెల నెల వేతనాలు తీసుకుంటూ, కార్యాలయాలకు పరిమితమవుతున్న నీటిపారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం వల్ల రైతులకు నష్టం కలుగుతుంది. కాలం కరుణించి ప్రాజెక్టుల్లో నీటి నిలువ పుష్కలంగా ఉండడంతో ఖరీఫ్, రబీ పంటలకు సాగుకు నీటి లభ్యత పుష్కలంగా ఉండడంతో కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీటి విడుదల కొనసాగుతుంది. ఇదే సమయంలో కట్టల నాణ్యత పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల కాలువ కట్టలకు బొంగలు, గండ్లు పడి ప్రమాదంగా మారుతున్నాయి. మండలంలోని రావులపెంట సమీపంలో బ్రిడ్జి వద్ద సాగర్ ఎడమ కాలువకు భారీగా లైనింగ్ దెబ్బతిని బుంగ పడటానికి సిద్ధంగా తయారైంది. ప్రారంభ దశలోని ఇసుక బస్తాలతో బుంగను పూడ్చినట్లయితే తక్కువ ఖర్చుతో ప్రమాదాన్ని నివారించవచ్చు. కానీ నేటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానిక రైతులు, ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా మండల కేంద్రం సమీపంలోని ఎల్-14 ఎత్తిపోతల పథకం కాల్వకట్ట కోతకు గురై ప్రమాద భరితంగా ఉంది. ఎల్ 14 ద్వారా సెకండ్ స్టేజ్ కి నీరు అందించే పైపులైన్ ఎయిర్ వాల్ నుంచి నీరు ఎగ చిమ్మి మొదటి స్టేజ్ ఎత్తిపోతల పథకం కాలువకట్ట పై పడటంతో కట్ట కోతకు గురై బలహీనంగా తయారై కట్ట తెగిపోయేలా ఉన్నది. కట్ట తెగినట్లయితే పంట నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఎన్ఎస్పి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎయిర్ వాల్వు మరమ్మత్తు, కట్ట మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

## 15న సంత్ సేవలాల్ జయంతి : సబ్ కలెక్టర్

నవతెలంగాణ-మిర్యాలగూడ



ఈనెల 15న మిర్యాలగూడలో జరిగే సంత్ సేవలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ సింగ్ అన్నారు.మంగళవారం స్థానిక కార్యాలయంలో సంత్ సేవలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణ విషయమై బంజారా సంఘా నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.బంజారాల అత్యంత వైభవంగా జరుపుకునే సేవలాల్ జయంతి వేడుకలకు బంజారా ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ప్రభుత్వం జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తుందని అందుకు అవసరమైన నిధులను మంజూరు చేసిందని తెలిపారు.మిర్యాలగూడలో మండల పరిషత్ కార్యాలయం నుండి క్యాంప్ లోని బంజారా భవన్ వరకు జరిగే ర్యాలికి బంజరాలకు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.అనంతరం బంజారాల ఆచారాలకు అనుగుణంగా మహా బోగ్ బండరో కార్యక్రమం వుంటుందని చెప్పారు.కార్యక్రమంలో ఎంఆర్ఓ హరిబాబు,ఎంఇఓ బాలాజీ,బాలు,బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్,తిరుపతి, భాస్య నాయక్,సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సావిత్రి



**నవతెలంగాణ-హుజూర్‌నగర్**

హుజూర్‌నగర్ మండల పరిధిలోని మాధవరాయని గూడానికి చెందిన చప్పిడి సావిత్రిని రెండవసారి హుజూర్నగర్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్కలంబ ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు జిల్లా మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అనురాధ కిషన్ రావు చప్పిడి సావిత్రికి హైదరాబాదులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చప్పిడి సావిత్రి మాట్లాడుతూ దళిత మహిళను అయినా తనను రెండోసారి పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమించడానికి సహకరించిన రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పరీక్ష సామగ్రి అందజేత

**నవతెలంగాణ-నూతనకల్**



తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ఆర్థిక సహాయంతో అశోక చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎర్ర పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులకు మంగళవారం పరీక్ష సామాగ్రిని ఫౌండేషన్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేసి చదివిన పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మూడ్ మోహన్ నాయక్ మరికంటి అశోక్, వినోద్ నాయక్ పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దగట్టు జాతర.. ముస్తాబవుతున్న దేవాలయం



- ఈ నెల 16 నుండి 20 వరకు పెద్దగట్టు జాతర
- రూ.5 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు
- పనులను పరిశీలించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- కలెక్టర్ అదేశాల మేరకు పనులు ముమ్మరం: కమిషనర్ బి.శ్రీనివాస్

**నవ తెలంగాణ-సూర్యాపేట**

రాష్ట్రంలో సమ్మక్క సారక్క మేడారం జాతర తర్వాత రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన పెద్దగట్టు లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరకు దేవాలయం ముస్తాబవుతోంది. సూర్యాపేట పట్టణానికి సమీపంలో దురాజ్‌పల్లి గ్రామంలో ఉన్న శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర ప్రతీ రెండేళ్లకోసారి జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జాతర నిర్వహణకు రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో జాతర నిర్వహణకు



మహర్దశ పట్టింది. లక్షలాది మంది యాదవుల ఆరాధ్య దైవమైన దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతరకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కలిగింది. ప్రతి రెండేండ్లకోసారి లక్షలాది మంది తరలివచ్చి ఘనంగా నిర్వహించుకునే ఈ జాతరలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పాలకవర్గం, అధికారుల పర్యవేక్షణలో ఐదు రోజుల పాటు నిర్వహించే పెద్దగట్టు జాతర కొనసాగనుంది. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులు గుట్టపైన, క్రింద ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గతంలో కంటే ఈసారి అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగడంతో పాటు దేవాలయం అందమైన రంగులతో కళకళలాడుతోంది. ఈ క్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులు, పాలకవర్గం సభ్యులతో పెద్దగట్టు ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆయన ఆదేశించారు.

**తాత్కాలిక నిర్మాణాలు..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే అనేక మంది మేధావులు, భక్తులు దురాజ్‌పల్లి జాతరలో శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని కోరుతున్నా.. ప్రతిసారి ప్రభుత్వం పెద్దగట్టు జాతరకు కోట్లల్లో నిధులు కేటాయిస్తున్నా.. శాశ్వత పనులు కాకుండా తాత్కాలిక నిర్మాణాలు మాత్రమే చేస్తున్న విషయం తెల్సిందే. ఆ నిధులతో జాతరలో మహిళలకు స్నానాల గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

భక్తులకు మౌళిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. నీటి సరఫరా, పారిశుధ్యం, మరుగుదొడ్ల కోసం రైతుల వద్ద 70 ఎకరాల భూమిని లీజుకి తీసుకొని వాటిని చదును చేసి క్లిన్ చేస్తున్నారు. గుట్టపైన ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్ ద్వారా కింద, పైన నిరంతరం మంచినీరు సరఫరా కోసం ప్రత్యేక ప్రణాళికతో పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గుట్టపైన ఎండోమెంట్ అధికారులు అభివృద్ధి పనులు చేపడుతుండగా గుట్ట కింద మాత్రం పురపాలక సంఘం వారు ఒక కోటి 67 లక్షల 30 వేల రూపాయల వ్యయంతో వివిధ రకాల అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ప్రధానంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గుట్ట ప్రాంతంలో పర్యవేక్షణ చేస్తూ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే జాతర సందర్భంగా వివిధ ప్రదేశాలలో టవర్ లైట్లు అలంకారిక లైట్లు ఏర్పాటు కోసం రూ.35 లక్షలు కేటాయించారు. అదేవిధంగా జాతీయ రహదారి





నుంచి ఆలయం వరకు బ్యారికేడ్ల ఏర్పాటు కోసం రూ.12 లక్షలు, తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు కోసం రూ.12 లక్షలు, ట్రాక్టర్లు, పారిశుధ్య కార్మికులను ఉపయోగించి చెత్త తొలగింపు కోసం రూ.25 లక్షలు కేటాయించారు. ఇక జేసీబీ, డోజర్ సహాయంతో నేల సమతలానికి రూ.10 లక్షలు కేటాయించగా ఆలయం చుట్టూ అడవి, పొదలను తొలగింపు కోసం రూ.8 లక్షలు కేటాయించారు. అదేవిధంగా కోనేరుకు పెయింటింగ్‌తో పాటు మెయింటెనెన్స్ కోసం రూ.8 లక్షలు, శాశ్వత టాయిలెట్ల మరమ్మతులు కోసం రూ.8 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.3 లక్షలు, నీటి ట్యాంకర్ల కోసం రూ.5 లక్షలు కేటాయించారు. ఇక గల్వర్ ద్వారా గందం తొలగింపు కోసం రూ.4 లక్షలు, సీసీ రోడ్డు మరమ్మతులకు రూ.5 లక్షలు, జాతర కోసం స్టోన్ డస్ట్ కోసం రూ.5 లక్షలు, గ్రావెల్ కోసం రూ.5 లక్షలు కేటాయించారు. జాతరలో సీసీ కెమెరాలు, సోలార్ లైట్ల మరమ్మతులు కోసం రూ.5 లక్షలు, స్నాన ఘట్టంలో వివిధ ప్రదేశాల్లో ప్లాట్‌ఫాం ఏర్పాటు, ఆర్‌సీసీ పైప్‌లైన్ ఏర్పాట్ల కోసం రూ.9.30 లక్షలు, నీటిమోటార్లు, సింటాక్స్ ట్యాంకులు,హెచ్‌డీపీఈ పైప్‌లైన్ సరఫరా, అమరికకు రూ.5 లక్షలు, కోనేరులో ఆర్‌సీసీలోడ్ శివుడి విగ్రహాన్ని సరఫరా చేసి ప్రతిష్టించడం కోసం రూ.3.00 లక్షలు కేటాయించారు. ఈ రకంగా ఒక కోటీ 67 లక్షల 30 వేల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులను గతంలో మునుపెన్నడూ లేని విధంగా చేపడుతున్నారు. దాదాపుగా 20 లక్షలకుపైగా భక్తులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల నుంచి తరలిరానున్నారు.

**కలెక్టర్ ఆదేశాలతో పనులు ముమ్మరం: మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్**

పెద్దగుట్ట కింద వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం కేటాయించిన ఒక కోటి 67 లక్షల 30 వేల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది. పనులు పూర్తి కావస్తున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పని చేస్తున్నాము. ఈ నేపథ్యంలో భక్తులంతా కూడా జాగ్రత్తలు పాటిస్తూ జాతరకు రావాలి. పురపాలక సంఘం పక్షాన అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం.

## బంటి హత్యకేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలి



- చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ కే.శ్రీదేవి

**నవతెలంగాణ-సూర్యాపేట**

మాలబంటి (వడ్లకొండ క్రిష్ణ)ను కుల దురాంహకారంతో హత్య చేసిన నిందితులను, సహకరించిన వారిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ కే.శ్రీదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వడ్లకొండ క్రిష్ణ కుటుంబాన్ని చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆమె పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్రాహ్మణీయ బావజాలం ముసుగులో జరుగుతున్న హత్యలను ప్రభుత్వం అరికట్టాలన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా పరిగణించి చర్యలు చేపట్టాలన్నారు. ఈ హత్యకు కేవలం కుటుంబ సభ్యులు మాత్రమే కాదని మొత్తం ఈ భావజాలాన్ని పెంచి పోషిస్తున్నది కుల పెద్దలేనని కుల దురాంహకారాన్ని రెచ్చగొట్టే సంస్కృతిని విడనాడాలన్నారు. ప్రతి స్త్రీ తన జీవితంలో వివాహం విషయంలో సొంత నిర్ణయం తీసుకునే హక్కు ఉందని పేర్కొన్నారు. భార్గవి కుటుంబానికి నిందితుల నుంచి ప్రాణహాని ఉందని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భార్గవి కుటుంబానికి న్యాయం జరిగే వరకు చైతన్య మహిళా సంఘం అండగా ఉండి ఆమె పక్షాన పోరాడుతుందన్నారు. కుల దురాహంకార హత్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించడంతో పాటు ఈ హత్యలకు ప్రత్యేక చట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం హైద్రాబాద్ కమిటీ కో-కన్వీనర్ సత్య, సభ్యులు సబిత, తిరుమ్మ, సావిత్రి, కిరణ్మయి, అరుణజ్యోతి, చింత పద్మలతో పాటు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు, పూర్వ ప్రభుత్వ న్యాయవాది తల్లమల్ల హసేన్, తెలంగాణ ప్రజాఫ్రంట్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, న్యాయవాది ఏడిండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.167.30 లక్షలతో అభివృద్ధి పనులు



- మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్

**నవతెలంగాణ-సూర్యాపేట**

రాష్టంలో రెండవ అతిపెద్ద జాతరైన లింగ మంతుల స్వామి (పెద్దగట్ట) జాతర సందర్భంగా గుట్ట క్రింద పురపాలక సంఘము ఆధ్వరంలో రూ167.30 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను చేయడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ బోళ్ల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక గుట్ట ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంగిల్ క్లియరెన్స్, బారికేడింగ్, లైటింగ్, బాత్రుమ్స్ రిపేర్లు,కోనేరు పెయింటింగ్ రిపేర్లు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, రోడ్ల పై గుంతలు పూడ్చుట,ప్యాచ్ వర్క్స్ పనులను నాణ్యతతో త్వరత గతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ లను ఆదేశించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. గుట్ట చుట్టూ పారిశుధ్య నిర్వహణ చేప్పట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇఇ యం.కిరణ్, డి.ఇ.సత్యారావు, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్,ఏ.ఇ తిరుమలయ్య, రాజిరెడ్డి, జూనియర్ అస్సిటెంట్లు యండి.గౌసుద్దీన్,ఎస్ .ఎస్.ఆర్.ప్రసాద్, ఇండ్ల మనోజ్ కుమార్ , హెల్త్ అస్సిటెంట్ సురేష్, శివప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

## 'ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి'

**నవతెలంగాణ-కోదాడటౌన్**



కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య అన్నారు. మంగళవారం స్థానిక లాల్ బంగ్లాలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న హైదరాబాదులో జరిగే బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాకముందు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించి 14 నెలల కాలం గడుస్తున్నా నేటికీ ఒక్క ఫ్రీ బస్సు తప్ప మిగతా ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. మాటలకు చేతలకు పొంతన లేనటువంటి విధంగా పరిపాలన కొనసాగుతున్నదని ఎద్దేవా చేశారు. ప్రజల పక్షాన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తారీకున హైదరాబాదులో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలని చలో హైదరాబాద్ పిలుపునివ్వడం జరిగిందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ బహిరంగ సభను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షుడు కాముల్ల నవీన్, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి వి నరసింహారావు, కాముల్ల శ్రీను, అలుగుబెల్లి సత్యనారాయణ రెడ్డి, పోకల మైసయ్య, విజయ్, వీరబాబు, రవితేజ, నాగేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సోమయ్య ఆశయాలను కొనసాగించాలి




**నవతెలంగాణ-మోతె**

కీలుకాని సోమయ్య ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మల్యాల గోపాల్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని లాల్ తండా ఆవాస గ్రామము కీలు కానీ నగర్లో సోమయ్య 12వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమయ్య రైతు కూలీల పేదల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నే ప్రజానాట్య మండల కళాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు కీలు కానీ లక్ష్మణ్, బంధువులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జై నరసింహ రావు, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు బచ్చలకూరి రాంబాబు, వేల్పుల వెంకన్న, మండల కమిటీ సభ్యులు కాంపాటి శ్రీనివాస్, కిన్నెర పోతయ్య, వెలుగు మధు, చేగువేరా కొప్పు వెంకన్న, బోడపట్ల హుస్సేన్, బానోతు వెంకన్న, ఎర్రబోయిన మల్సూరు, ఐద్వా నాయకురాలు మల్యాల మనమ్మ, కాంగ్రెస్ పార్టీ సిరికొండ గ్రామ శాఖ అధ్యక్షులు నందిగామ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## అర్చకులు రంగరాజన్‌పై దాడిని ఖండించిన పాస్టర్స్

**నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్**



రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సిఎస్ రంగరాజన్‌పై మతం ముసుగులో కొందరు దుండగులు దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా పాస్టర్స్ పెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ దుర్గం ప్రభాకర్, సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ డా.జలగం జేమ్సులు తెలిపారు. మంగళవారం ఆత్మకూర్ మండల కేంద్రంలోని పాస్టర్ రెవరెండ్ తాడంకి కిరణ్ బాబు ఇమ్మానియెల్ ప్రార్థన మందిరంలో జరిగిన సమావేశంలో వారు సంయుక్తంగా మాట్లాడారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలుపుతూ అన్నీ మతాలవారు ముక్తా కంఠంతో దీనిని ఖండించాలని అన్నారు. ఈ సమావేశంలో ఫాస్టర్స్ పెలోషిప్ గౌరవ సలహాదారులు బొక్క ఏలియా రాజు,పెన్ పహాడ్ మండల అధ్యక్షులు రెవ.జాన్ ప్రకాష్,రెవ.పివి బోయాజ్, రెవ.బానోత్ సుధాకర్,పాస్టర్స్ బొప్పాని అన్వేష్,పుల్లూరు మహేందర్,మల్లేపల్లి ప్రకాష్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్**



సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా పోస్టర్‌ని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెఫర్ ఇంటర్ నెట్ డే అనేది ఆన్ లైన్ భద్రత, డిజిటల్ సంరక్షణ ప్రాధాన్యతను ప్రజలకి అవగాహన కల్పించటానికి చేపడుతున్న కార్యక్రమం అని అన్నారు.ఆధార్, పాన్ లేదా బ్యాంక్ వివరాలకు సంబందించిన ఓటిపిని ఎవరైనా ఫోన్‌లో అడిగితె చెప్పవద్దని, డబ్బులు చెల్లించేటప్పుడు క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి చెల్లించాలని, ఆన్‌లైన్‌లో ఎవరికి వ్యక్తగత సమాచారం పంచుకోరాదని,తెలియని వారు ఏమైనా ఆన్ లైన్ లింక్ లు పంపితే వాటిని వెంటనే తొలగించాలని, ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ ఆదాయం వస్తదనే అఫర్లను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. సైబర్ నేరాల వళ్ళ ఎవరికైనా సమస్య ఏర్పడితే వెంటనే టోల్ ఫ్రి నెంబర్ 1930 కి కాల్ చేసి పిర్యాదు చేయాలని తదుపరి అధికారులు సమస్యని పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు. సైబర్ హైజీన్ అనేది వ్యక్తులు తమ ఫోన్, కంప్యూటర్ తదితర పరికరాలలో వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకింగ్, మాల్వేర్ వంటి వాటి నుండి సంరక్షించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపర్ టిడెంట్లు శ్రీనివాస రాజు, పద్మారావు, యల్‌డియం బాపూజీ, ఈడియం గఫార్, ఎన్ఐసి సిబ్బంది అర్షద్, లావణ్య, విజయ్ పాల్గొన్నారు.

## జేఈఈలో కోదాడ రేస్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం









**నవతెలంగాణ-కోదాడటౌన్**

జాతీయస్థాయిలో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం ప్రకటించింది. ఈ ఫలితాల్లో కోదాడ రేస్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు ర్యాంకుల పరంగా ప్రభంజనం సృష్టించారు. 100 పర్సంటేజ్‌కు గాను కళాశాలకు చెందిన ఎస్.దీక్షిత 98.79, పి.సూర్య ప్రకాష్, 98.43, ఎస్‌డి.హుజఫా 98.34, టి.రోహిత్ రెడ్డి 98.02 సాధించారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మెన్ బాణాల వసంత వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మూడు జిల్లాల స్థాయిలో కార్పోరేట్ విద్యను అందిస్తూ ఎందరో విద్యార్థులను గత ఎనిమిది సంవత్సరాల నుండి రేస్ అకాడమీ నుండి ఐఐటి, ఎన్ఐటి, కళాశాలలో ఎందరో విద్యార్థులు సీట్లు పొందే విధంగా విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు.. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



# రేషన్ కార్డులకు మండలంలో భారీగా ధరఖాస్తులు

- మండలంలో 4 వేలకు పైగా దరఖాస్తులు
- అన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డే ప్రామాణికం
- తొమ్మిదేండ్లుగా కొత్తకార్డులు ఇవ్వకపోవడంతో పెరిగిన డిమాండ్

**నవతెలంగాణ-మునగాల**

రేషన్ కార్డుల కోసం వివిధ గ్రామాల నుంచి 4 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. తొమ్మిదేండ్లుగా కొత్త రేషన్ కార్డుల జారీ లేక పోవడంతో అనేక మంది కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డు అనేది పేద ప్రజలకు తప్పని సరైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే రేషన్ కార్డు కావాల్సిందే. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారిని ప్రభుత్వం పేదలుగా గుర్తిస్తుంది. రేషన్ పంపిణీతో పాటు సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ కార్డును పరిగణనలోకి తీసుకుంటున్నారు. మరీ ముఖ్యంగా ఆరోగ్యశ్రీతో వైద్య సహాయం పొందేందుకు తెల్ల రేషన్ కార్డు తప్పనిసరిగా మారింది. ఇంకా ఇందిరమ్మ ఇండ్లు, ప్రజాపంపిణీ ద్వారా సన్న బియ్యం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్డుల కోసం అనేక తంటాలు పడుతున్నారు. ఇంకా ఆరోగ్యశ్రీ పథకం వర్తించే ప్రయివేటు వైద్యశాలలో చికిత్సలు పొందేందుకు రేషన్‌కార్డు అవసరం అవుతుంది. ప్రభుత్వం అందించే సంక్షేమాలకు రేషన్ కార్డు నిబంధనలు పెట్టడంతో కార్డుకు డిమాండ్




పెరిగింది. ఇంకా అనేక రకాల అవసరాల కోసం పేద కుటుంబాలకు దీని అక్కర మరింత అధికమైంది. దీంతో ఒకే ఇంట్లో కలిసి వుంటున్న తల్లి తండ్రి కొడుకు కోడలు వేరు వేరుగా వుంటున్నామని, కొత్తగా పెళ్లయిన వారు కూడా అధిక సంఖ్యలో కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరధిలో ఇప్పటికే 13,743 రేషన్ కార్డులు వున్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 746 కాగా తెల్లరేషన్ కార్డులు 12,997 వున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2023 డిసెంబర్‌లో ప్రజాపాలన ద్వారా రేషన్ కార్డుల ధరఖాస్తులను స్వీకరించింది. ఈ ఏడాది జనవరి నెలలో కూడా ప్రజాపాలన గ్రామ సభల ద్వారా మరోసారి దరఖాస్తులు సేకరించింది. రెండు దఫాలు గ్రామాల వారిగా దరఖాస్తుల వివరాలను పరిశీలిస్తే ఆ కుపాములలో 113మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా బరాఖత్ గూడెం లో 344 మంది. ఈదుల వాగు తండాలో 20, గణపవరంలో 169మంది, జగన్నాధపురంలో 100, కలకోవలో 252 మంది, కోదండరామాపురంలో 27గురు, కొక్కిరేణిలో 90మంది, కృష్ణనగర్‌లో 67మంది, మాధవరంలో 92 మంది, ముకుందాపురంలో 208మంది, మునగాలలో 461 మంది, నర్సింహుల గూడెంలో 267 మంది, నారాయణ గూడెంలో 195 మంది, నర్సింహాపురంలో 54 మంది, నేలమర్రిలో 129 మంది, రేపాలలో 196 మంది, సీతానాగారం తండాలో 108మంది తాడువాయిలో 197మంది, తిమ్మారెడ్డి గూడెంలో 90 మంది, వెంకట్రాపురంలో 130మంది, విజయరాఘవాపురంలో 152 మంది రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారు. 2023 డిశంబరు నెలలో ప్రజాపాలనలో 2506 దరఖాస్తులు రాగా ఈఏడాది జనవరి నెలలో నిర్వహించి ప్రజాపాలన గ్రామ సభలలో 955 అప్లికేషన్లు వచ్చాయి. ఇవి కాక కుల గణన ఇంటింటా సర్వే సమయంలో కూడా మరో వెయ్యి దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలుపుతున్నారు. మొత్తంగా మండలంలో నాలుగు వేలకు పైగానే కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
3
బుధవారం | ఫిబ్రవరి 12, 2025 | www.navatelangana.com

## డీవైఎఫ్ఐ పోరాట ఫలితమే అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణం




**నవతెలంగాణ-భువనగిరి**

డీవైఎఫ్ఐ పోరాట ఫలితమే భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీ ఒకటో వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణపనులలో కదలిక వచ్చిందని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం తెలిపారు. బుధవారం అర్బన్ కాలనీ అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను పరిశీలించి మాట్లాడారు. అర్బన్ కాలనీలో ప్రధాన సమస్యగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీలను పూర్తి చేయాలని, సంగం ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు నిర్వహించామన్నారు ఈ పోరాటాలకు స్పందించిన అధికారులు మోరీల నిర్మాణం చేపట్టాలన్నారు పనులు పూర్తిగా అవడానికి అధికారులు స్పందించడం అభినందనీయమన్నారు. అన్నారు. ప్రధాన రహదారితో పాటు కాలనీ మొత్తం అండర్ గ్రౌండ్ డ్రైన్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు షేక్ రియాజ్, ఎండి.సాజిద్, ఎండి. సోహేల్, హరీశ్, ఎండి.జావీద్, నేహాల్, పయాజ్ పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్‌లో కేంద్ర బడ్జెట్-గ్రామీణ పేదలపై ప్రభావం సదస్సు

**నవతెలంగాణ-భువనగిరి**

ఈనెల 12న బుధవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న 'కేంద్ర బడ్జెట్ - గ్రామీణ పేదలపై ప్రభావం' అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సును వ్యవసాయ కార్మికులు జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రామీణ వ్యవసాయ కూలీలకు, రైతులకు, పేదలకు, ఉపాధి హామీ కార్మికులకు, వృత్తి దారులకు తీవ్రమైన నష్టం వాటిల్లిందన్నారు.ఉపాధి కార్మికులకు రూ.2.5 లక్షల వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.86 వేలు కేటాయించి చేతులు దులుపుకుంటే ఎట్లా అని ప్రశ్నించారు. గ్రామాలలో విద్య వైద్యం, ఉపాధి, సంక్షేమం లాంటి రంగాలను బలోపేతం చేయడానికి కూడా ప్రభుత్వం సరైన నిధులు కేటాయించడం లేదన్నారు. సదస్సుకు సంఘం జాతీయ అధ్యక్షులు విజయ్ రాఘవన్, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్‌తో పాటు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. నాగయ్య ఆర్.వెంకట్రాములు పాల్గొంటున్నారని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి



**నవతెలంగాణ-అడ్డగూడూర్**

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని చౌళ్లరామారం-బొడ్డుగూడెం మధ్య చోటు చేసుకుంది. ఎస్సై డి.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..మోత్కూర్ మండలం దాచారం గ్రామంలోని ప్రభుత్వ పాఠ శాలలో ఇంగ్లీషు సబ్జెక్టు టీచర్‌గా పని చేస్తున్న మహమ్మద్ కుద్సియా జబిన్( 55) స్కూల్ కాంప్లెక్స్ మీటింగు అడ్డగూడూరులో ఉండడంతో అక్కడికి వెళ్తున్న క్రమంలో చౌళ్లరామారం- బొడ్డుగూడెం గ్రామాల మధ్య టోల్‌గేట్ దగ్గరలో కంకరలో స్కూటీ స్కిడ్ కావడంతో వెంటనే గుర్తుతెలియని వాహనం స్కూటీపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది.ఈమె దాచారం గ్రామంలోనే ఉంటూ గ్రామంలోని స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. మృతురాలికి ముగ్గురు సంతానం.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మీసేవ కేంద్రాల తనిఖీ

**నవతెలంగాణ-ఆలేరుటౌన్**



ఆలేరు మండలకేంద్రంలో మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా మీసేవ, జిల్లా మేనేజర్ ఎస్. సాయి కుమార్ పలు మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వం నూతనంగా చేపట్టిన నూతన ఆహారభద్రతా కార్డు దరఖాస్తు సర్వీస్ గురించి మీసేవ కేంద్రాల నిర్వాహకులకు తగు సూచనలు చేశారు.మీసేవ నిర్వా హకులు అడిగిన పలు సందేహాలకు సమాధానం చెప్పారు.ప్రజలు నిర్ణీత రుసుం చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రభుత్వం నిర్వహి ంచిన ప్రజాపాలన, గ్రామసభ ద్వారా దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు చిక్క శ్రవణ్ కుమార్, స్వామి, నర్సింహారావు, రమేశ్ పాల్గొన్నారు.

## సబ్ జూనియర్ జిల్లా కబడ్డీ బాలబాలికల ఎంపిక

**నవతెలంగాణ-ఆలేరుటౌన్**

ఈనెల 15 తేదీ, శనివారంఉదయం 10 గంటలకు యాదాద్రి భువనగిరి జిల్లా కబడి అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో సబ్‌జూనియర్ బాలబాలికల కబడ్డీజిల్లా సెలక్షన్ నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి పూల నాగయ్య మంగళవారం తెలిపారు. ఇందులో పాల్గొనున్న క్రీడాకారులు 01/04/2009 తర్వాత జన్మించిన వారై ఉండి 16 ఏండ్లలోపు ఉండాలన్నారు.55 కిలోల లోపు బరువు వారై ఉండాలని తెలియజేశారు. క్రీడాకారులు బోనఫైడ్, ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు. ఇందులో జిల్లా జట్టుకు సెలక్టయిన క్రీడాకారులు ఈనెల 20 నుండి 23 వరకు వికారాబాద్ జిల్లాకేంద్రంలో జరిగే 34వ రాష్ట్ర కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. మరిన్ని వివరాలకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి గంధమాల కుమార్ ఫోన్ నెం: 9182632738 సంప్రదించాలని సూచించారు.

## గీత కార్మికునికి ఎక్స్‌గ్రేషియా రూ. 25 లక్షలివ్వాలి

- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాగిరి కిష్టయ్య

**నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్**

గంగాదేవి శంకరయ్య కుటుం బానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాగిరి కిష్టయ్య అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామానికి చెందిన గంగాదేవి శంకరయ్య సోమవారం సాయంత్రం వృత్తిలో తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుండి కిందపడి చనిపోయారు. శంకరయ్య మృత దేహాన్ని చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాగిరి కృష్ణయ్య సందర్శించి జిల్లా కమిటీ తరపున సంతాపం తెలిపారు.ఎక్సైజ్ అధికారులు పంచనామ నిర్వహించి శంకరయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ కేజీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల లక్ష్మయ్యగౌడ్, మండల అధ్యక్షులు మారగోని అశోక్‌గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి అంతటి అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.



## మదర్‌డెయిరీని లాభాల్లోకి తీసుకురావాలి

- రాజపేట పాల సంఘం చైర్మెన్ సందిల భాస్కర్‌గౌడ్

**నవతెలంగాణ-రాజపేట**

మదర్ డైరీ చరిత్రలో కొందరు పాలక వర్గం మినహా మిగత వారందరూ అక్రమాలకు పాల్పడడం ఇష్ట రాజ్యాంగా వ్యవహరించడంతో మదర్‌డెయిరీ కోట్ల రూపాయల్లో అప్పుల్లో కూరుకుపోయిందని రాజపేట పాలసంఘం చైర్మెన్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు సంధిల భాస్కర్‌గౌడ్ అన్నారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దిద్దుబాటు చర్యలు మాని ప్రస్తుత చైర్మెన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి పాలకవర్గం ఆస్తులు అమ్మడం గొప్ప కాదని విమర్శించారు. మంగళవారం రాజపేట పాలసొసైటీ కేంద్రంలో రైతులు, రాజాపేట ఎంసీసీ పరిధిలోని పలువురు చైర్మెన్లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాజు అనే వ్యక్తికి సీఎస్ఎఫ్ పేరుతో లీటరుకు ఒక రూపాయి 75 పైసలు ఇస్తూ సంవత్సరానికి రూ.4.50 కోట్లు అప్పచెబుతున్నారని ఆరోపించారు. మదర్ డైరీలో ఉన్న ఎక్సెస్ ఉద్యోగులతో పాల విక్రయాలను పెంచొచ్చని రాజు లాంటి వ్యక్తి అవసరమా అని ప్రశ్నించారు. నలగొండ రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం పీకల లోతు అప్పుల్లోకి కూరుకు పోవడానికి కారణం ఎవరు తెలియజేయాలని డిమాండ్ చేశారు. అందిన కాడికి పాలకవర్గం దోచుకోవడమేనని, అనేక అక్రమాలకు పాల్పడడం ద్వారా నష్టం వాటిల్లిందన్నారు. ఆస్తులను అమ్ముకుంటూ పోతే రైతులను ఉద్యోగులను రోడ్డున పడేసి మదర్ మదర్‌డెయిరీకి తాళం వేసే పరిస్థితి వస్తుందన్నారు.ఇప్పటికైనా మదర్‌డెయిరీ ఆస్తులను విక్రయించే యువజన విరమించుకోవాలని హితవు పలికారు. ప్రతి పదిరోజులకోసారి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జన్నపల్లి బాలరాజు రెడ్డి, పోసుగొండ దశరథ, సందేల వెంకటేష్, మేకరమేష్, సిగ్గుల సిద్ధులు, బల్లసిద్ధులు, కోయ రమేష్, గుంటి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీలతో సమావేశం

**నవతెలంగాణ-ఆలేరుటౌన్**

మండల ప్రజా పరిషత్ రెండో సాధారణ ఎన్నికల్లో భాగంగా, 2025 జిల్లా ప్రాదేశిక, మండల ప్రాదేశిక ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల సభ్యులతో సమావేశం 13వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు నెల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్ మండలకేంద్రంలో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్‌స్టేషన్ల నిర్వహణ, ఇతరఅంశాలపై రాజకీయ పార్టీల సభ్యులతో చర్చిస్తామన్నారు.సకాలంలో వివిధ పార్టీల సభ్యులు తమ అభిప్రాయాలను తెలియ జేయాలన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు

**నవతెలంగాణ-రాజపేట**



రాజపేట మండలం నరసాపురం గ్రామం లోని బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు.కాంగ్రెస్‌లో చేరిన వారిలో రేఖం నర్సింహులు, దుబ్బాసి అంబేద్కర్,ఎల్మ శీను, దుబ్బాసి ప్రశాంత్, మాలి మధు, మాలి బన్నీ, గిద్దశేఖర్, ఎమ్మమహేందర్, నీల నరేష్ తదితరులు ఉన్నా రు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నమిలమహేందర్‌గౌడ్, నాయకులు, మాజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి ఘన స్వాగతం పలికిన నాయకులు

**నవతెలంగాణ-చౌటుప్పల్**



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన జాన్ వెస్లీ మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రానికి వచ్చారు. ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జాన్‌వెస్లీకి ఘనస్వాగతం పలికారు. జాతీయ రహదారిపై సీపీఐ(ఎం) జెండాలు చేతబూని సీపీఐ(ఎం) జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎమ్‌డి.జహంగీర్, రాష్ట్రకమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు గోపగోని లక్ష్మణ్‌గౌడ్, దండ హిమబిందుఅరుణ్‌కుమార్‌లను మున్సిపల్, మండలకమిటీల ఆధ్వర్యంలో పూలబొకేలు అందజేసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, బూర్గు కృష్ణారెడ్డి, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, గుంటోజు శ్రీనివాస్‌చారి, జిల్లా కమిటీ సభ్యులు గంగదేవి సైదులు, గోశిక కరుణాకర్, ఎమ్‌డి.పాషా, రాగీరు కృష్ణయ్య, అవ్వారు రామేశ్వరి, గడ్డం వెంకటేశ్, మద్దెల రాజయ్య, దోడ యాదిరెడ్డి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, నాయకులు బండారు నర్సింహ, పల్లెమధుకృష్ణ, తడక మోహన్, బొజ్జ బాలయ్య, కొండ శ్రీశైలం, సంజీవరెడ్డి, బొడ్డు అంజిరెడ్డి, ఆకుల ధర్మయ్య, తూర్పునూరు మల్లేశం, చింతల సుదర్శన్, భావండ్లపల్లి స్వామి, పొట్ట శ్రీను,ఉష్కాగుల శ్రీను, ఎండి.రేష్మ, చింతకింద శారద, మల్లేపల్లి లలిత, సిర్పంగి స్వామి పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆదేశాలతో.. గురుకుల పాఠశాలలో పారిశుధ్యం మెరుగుదల

- మరోవైపు వైద్య శిబిరం
- నిర్లక్ష్య ప్రభుత్వ అధికారులకు సింహ స్వప్నంగా మారిన కలెక్టర్ హనుమంతరావు

**నవతెలంగాణ-రామన్నపేట**

ప్రభుత్వ పాలనకు నీతి, నిజాయతీ, నిబద్ధత, పట్టుదల కలిగిన, బాధ్యతాయుతంగా ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఉన్నతాధికారులు పనిచేస్తే ఆ పాలన ప్రజారంజకంగా ఉంటుందనడంలో సందేహమే లేదని చెప్పక తప్పదు. కలెక్టర్ ఎం హనుమంతరావు అలాంటి ఉన్నతాధికారులలో మొదటి స్థానంలోనే ఉంటారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి నిరంతరం జిల్లావ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తూ ఆస్పత్రుల్లో, విద్యాలయాలలో, గురుకులలో ఆకస్మిక సందర్శనలకు వెళ్తూ తనిఖీలు చేస్తున్నారు. గంటల తరబడి పరిశీలన, తనిఖీలు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న, రోజుల తరబడి విధులకు గైరాజరవుతున్న అధికారులు, ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరిస్తున్నారు. తీరు మారకుంటే షోకాస్ నోటీసులు సైతం జారీ చేస్తున్నారు. గ్రామాలల్లోని పేదలకు మెరుగైన విద్య, నాణ్యమైన వైద్యం అందించడం కోసం నిరంతరం అలుపెరుగని కృషి చేస్తున్నారు.అప్పటికప్పుడే నిర్ణయాలు తీసుకొని తన పరిధిలో ఉన్న నిధులను వెచ్చించి సమస్యలను పరిష్కరిస్తున్నారు. దీంతో జిల్లాలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వశాఖలలోని అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి సింహ స్వప్నంగా మారారని చెప్పక తప్పదు. అదే సమయంలో ఎవరైనా బాధితులు వినతి పత్రాలు ఇస్తే స్వీకరించి సమస్యను తెలుసుకొని అక్కడినుండే అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించేలని ఆదేశాలిస్తున్నారు. మరి కొన్నింటికీ పరిష్కారమార్గాన్ని సైతం చూపుతున్నారు. రామన్నపేట మండలాన్ని ఇప్పటికే కలెక్టర్ పదిసార్లకు పైగా సందర్శించారు. రామన్నపేట ప్రభుత్వ వైద్యశాలను పలుమార్లు సందర్శించారు. అన్ని విభాగాలను లోతుగా తనిఖీ చేశారు.సెలవులు పెట్టకుండా నెలల తరబడి విధులకు ఎగనామం పెట్టిన వారిని గుర్తించి హెచ్చరించారు. మండలంలోని జనంపల్లి గ్రామంలో ఉన్న ఉన్న బాలికల గురుకుల పాఠశాలను సోమవారం ఆకస్మికంగా సందర్శించి లోతుగా పరిశీలన చేశారు. తానే స్వయంగా వాటర్‌ట్యాంకుల పైకి పరిశీలించారు. ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్ పనితీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు సైతం అందజేశారు. పాఠశాలలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించాలని ఎంపీడీఓ యాకుబ్‌నాయక్‌ను, తహసీల్దార్ లాల్‌బహు దూర్‌లను ఆదేశించడంతో స్థానిక ఎన్నికల, సర్వేల బిజీగా ఉన్నప్పటికీ కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించడంతో పాటు 20 మంది శానిటేషన్ సిబ్బంది, అధికారులు కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. మునిపంపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ అశ్వినికుమార్ పర్యవేక్షణలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కోతుల బెడదను అరికట్టడానికి యుద్ధ ప్రాతిపదికన సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



**జిల్లాకు రాజు కలెక్టర్..**

జిల్లాకు రాజు కలెక్టర్ అనే పదాన్ని యాదాద్రి భువనగిరి కలెక్టర్ ఎం హనుమంతరావు నిజం చేశారని చెప్పవచ్చు. బాధితుల సమస్యలు పరిష్కరిస్తూ అండగా నిలుస్తున్నారు.అదే సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న ఉద్యోగుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు.గ్రామాలలో పేదప్రజలు ఉంటారని, వారికి మనం ఎప్పుడూ నిరంతరం అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశిస్తున్నారు. బాగా పని చేసే అధికారులను, ఉద్యోగులను అభినందిస్తూ ముందుకు సాగుతున్నారు.

# ఇచ్చిన మాటకు కట్టుబడ్డ కాంగ్రెస్

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**నవతెలంగాణ-మోత్కూరు**



ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కేటీఆర్ మతితప్పి మాట్లాడుతున్నారని, తెలివి తక్కువ మాటలు మానుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందులసామేలు హితవు పలికారు.మంగళవారం సాయంత్రం మోత్కూర్ మున్సిపల్ కేంద్రంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొడంగల్ సభలో కేటీఆర్ ఆగమాగం అవుతూ స్థాయిని మించిన మాటలు మాట్లాడారని, గుర్తింపు కోసం ఆరాటపడు తున్నారన్నారు.కవితతోనే క్రేజీవాల్ ఓడిపోయారని తెలిపారు.కేసీఆర్‌ను కలిసిన ప్రతి ఒక్కరు ఓడిపోతున్నారని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వం కోసం, నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ప్రజలు, అమరుల ఆకాంక్ష మేరకు బీఆర్ఎస్ ఉద్భవిస్తే ఆ పార్టీని వాడుకుని తొమ్మిదిన్నరేండ్లు రాజ్యమేలి సంపద మొత్తం దోచుకున్నారని విమర్శించారు.కేసీఆర్ కుటుంబం కోసమే బీఆర్ఎస్‌గా పేరు మార్చుకున్నారని అన్నారు. 19 మంది జడ్జిల ఫోన్ ట్యాపరింగుతో పాటు పలువురి ట్యాపరింగులతో నీచమైన పరిపాలన కొనసాగించారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పూర్తిగా కొట్టుకుపోతుందన్నారు. 140 ఏండ్ల కాంగ్రెస్ భారతదేశ అభివృద్ధి కోసం, సామాజిక న్యాయం కోసం పనిచేసే పార్టీ అని, వ్యక్తులు మారిన పార్టీ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. పోడు భూముల విషయంలో దుశ్శాసనపర్వం చేసిన బీఆర్ఎస్ పార్టీ దళితుల కోసం ఎంతవరకు పోరాడుతుందన్నారు. ఏబీసీడీ వర్గీకరణ చేస్తే కృతజ్ఞత తెలిపే ఇంకితజ్ఞానం, బీసీ కులగణన చేస్తే మాట్లాడే నైతిక బాధ్యత లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు పోటీల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.వారిని గెలిపించే బాధ్యత తనకు అప్పగించినట్లు చెప్పారు.అన్ని గ్రామాల, వార్డుల నివేదికలను తీసుకున్నట్లు సమస్యలను, ఇబ్బందులను తెలుసుకున్నట్లు, వాటిని త్వరలో పరిష్కారమయ్యే విధంగా చూస్తానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కంచర్ల యాదగిరిరెడ్డి, డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, అవిలుమల్లు, సింగిల్ విండో చైర్మెన్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జి.రామచంద్రుగౌడ్, బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి, నాయకులు బొడ్డుపల్లి మైసయ్య, బయ్యనిరాజు, పురుగులవెంకన్న, కె.నాగార్జున్‌రెడ్డి, సురేష్, మత్స్యగిరి, అంజయ్య, బాలరాజు, స్వామిరాయుడు, ఆనందమ్మ, ప్రమీళ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జనంపల్లి గురుకుల పాఠశాలలో స్పెషల్ హెల్త్ క్యాంప్

**నవతెలంగాణ-రామన్నపేట**

మండలంలోని జనంపల్లి బాలికల గురుకుల పాఠశాలలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశాల మేరకు మంగళవారం మునిపంపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ ప్రవీణ్, రామన్నపేట మండల వైద్య అధికారి డాక్టర్ అశ్వినికుమార్ పాఠశాలల్లోని మొత్తం 540 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశ్విని కుమార్, తహసీల్దార్ లాల్ బహదూర్, యాకూబునాయక్ మాట్లాడుతూ మొత్తం 540 మంది విద్యార్థులను పరీక్షించగా సాధారణ చర్మ వ్యధులైన గజ్జి, తామెర, శీతాకాల చర్మ వ్యాధులు, సాధారణ చర్మ ఎలర్జీ మొదలగు కలిగిన వారు 148, సాధారణ జలుబు, దగ్గు, జ్వరం ఉన్నవారు 157, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు 120 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.115 మంది విద్యార్థులకు ఆరోగ్య సమస్యలేవ న్నారు.వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. పాఠశాల ప్రాంగణం అంతా 20 మంది పారిశుధ్య సిబ్బందితో పారిశుధ్యాన్ని మెరుగుపరిచామన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజు, డాక్టర్ వెంకట్, డాక్టర్ చందస్వి, సూపర్వైజర్లు,సీహెచ్ఓ చంద్రకళ, ఎంపీహెచ్ఈఓ గోపాల్, హెచ్ఎస్ వాణిశ్రీ, ఆశాలు పాల్గొన్నారు.



## సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నూతన కార్యాలయ నిర్మాణానికి సన్నాహాలు

**నవతెలంగాణ-ఆలేరుటౌన్**

ఆలేరు మండల కేంద్రం లో సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ మంగళవారం తెలిపారు. ఆలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మూల మలుపు వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం నిర్మాణ స్థలంలో కార్యాలయాన్ని చూపించే బోర్డును, కార్యాలయం స్థలం పరిశీలించి హద్దులు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఐకే ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య,జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్లేపు అడవయ్య, బేజాడి కుమార్, జిల్లా నాయకులు బర్మ బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు పద్మ సుదర్శన్,గడ్డం నాగరాజు పాల్గొన్నారు.



## వైభవంగా రథోత్సవం

- గరుడ వాహనదారుడిగా నరసింహుడు

**నవతెలంగాణ-యాదగిరిగుట్ట**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి అనుబంధ దేవాలయం పాతగుట్ట బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. అంతకుముందు గరుడ వాహనదారుడుగా లక్ష్మీనరసింహస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు.ఉదయం ఆలయంలో నిత్య ఆరాధనలు అనంతరం పారాయణకులతో చతుర్విధ పారాయణాలు నిత్యవనాలు నిర్వహించారు. ఉత్సవాలలో బ్రహ్మాది దేవతలతో పాటు సకల జీవరాశి దర్శించి తరించే గొప్ప వేడుక దివ్యవిమాన రథోత్సవ వేడుకని ఆలయ అర్చకులు తెలిపారు.రథోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహి ంచారు. గాయత్రిభజన మండలి వారితో భజన,హరీష్ డ్యాన్స్ అకాడమీ వారితో కూచిపూడి నృత్యం, యాదగిరి గుట్టకు చెందిన ఏ సహస్ర ఏలూరు యామినితో కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది.ఉత్సవాల్లో కలెక్టర్ హనుమంతరావు అనువంశిక ధర్మకర్త నరసింహామూర్తి, ఈఓ భాస్కర్‌రావుతో పాటు అర్చకులు బృందం పాల్గొన్నారు.



## విద్యా ఆగ్రో రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీ

**నవతెలంగాణ-రామన్నపేట**

రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం. గ్రామ విద్యాఆగ్రో రైస్‌మిల్లును మంగళవారం సివిల్ సప్లయ్ విజిలెన్స్ అధికారులు సీఐగౌస్, డీఎస్ఓ రోజారాణి ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్‌మిల్లులో ఉన్న వరిబస్తాలను, మిల్లులోని రికార్డులను సంవత్సరాల వారీగా తనిఖీని కొనసాగిస్తున్నారు. మిల్లులో ఉన్న ధాన్యం, బియ్యం నిల్వలను సరిపోల్చుతూ తనిఖీలు నిర్వహిస్తున్నారు.పూర్తి వివరాలు బుధవారం వెళ్లడావుతాయని సమాచారం. తనిఖీల్లో డీఎం హరికృష్ణ, రామన్నపేట డీటీసీఎస్ బాలమణి ఉన్నారు.



## భువనగిరి స్పెషల్ ఆఫీసర్‌గా శ్యాంసుందర్

**నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్**

భువనగిరి మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్ సుందర్ మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ దినాకర్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బొందుగుల నరసింహారెడ్డి చిరస్మరణీయుడు

**నవతెలంగాణ-రాజపేట**

ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ బొందుగుల నరసింహారెడ్డి ప్రజలకు, రైతులకు చేసిన సేవలు వెలకట్టలేనివని, చిరస్మర ణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేందర్‌గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజుగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని సొంత గ్రామమైన రాజపేట మండలం బొందుగులలో బొందుగుల నర్సింహారెడ్డి విగ్రహం వద్ద పూలమాలలేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి మసిరెడ్డిసురేందర్, బాల్ద శ్రీకాంత్, బీఆర్ఎస్ మండలఅధ్యక్షులు సట్టు తిరుమలేష్, జర్నలిస్టు అసోసియేషన్ మండల అధ్యక్షులు ఉప్పల రమేష్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

**నవతెలంగాణ-అడ్డగూడూర్**

అడ్డగూడూరు మండల పరిధిలోని మంగమ్మగూడెం సాంఘికసంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పీజీటీ మ్యాథ్స్ సబ్జెక్టు బోధించుటకు అతిథి అధ్యాపకులుగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజినా చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతిథి అధ్యాపక పోస్టులో చేరడానికి కావల్సిన అర్హతలు ఎమ్మెస్సీ మ్యాథ్స్,బీఈడీ పూర్తి చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు.అర్హత కలిగిన వారు కళాశాల ప్రిన్సిపాల్ విజినాచౌదరి నెం:7032814727కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు.

## కుష్టు వ్యాధి నివారణా వారోత్సవాలు

**నవతెలంగాణ-భువనగిరి**

కుష్టు వ్యాధి పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కుష్టు క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ సాయి శోభలు తెలిపారు. మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళాశాలలో జాతీయ కుష్టు వ్యాధి నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు కుష్టు వ్యాధి నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు మహాత్మా గాంధీ వర్ధంతిని యాంటీ లిఫ్ట్ దినోత్సవం గా ప్రతి సంవత్సరం పాటిస్తున్నామన్నారు .ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్ జిల్లా కుష్టు క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ సాయిశోభ డిప్యూటీ పారామెడికల్ అధికారులు రాములు రవీందర్‌రెడ్డి మాధవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. జి రమేష్, కె కిష్టయ్య, ఎస్.సుధ, కె.బాలరాజు, లక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 80 భోజన ప్లేట్లు అందజేత

**నవతెలంగాణ-రామన్నపేట**

మండలంలోని కక్కిరేణి గ్రామానికి చెందిన కన్నెబోయిన సైదులు భార్య కన్నెబోయిన అలివేలు జ్ఞాపకార్థంగా వారి కుమారుడు, కోడలు కన్నెబోయిన నరేష్ తనుశ్రీ సోమవారం గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 80 భోజన ప్లేట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు భీమిడి ఉపేందర్‌జీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఉన్న గ్రామ పాఠశాల అభివృద్ధి కొరకు గ్రామ యువత, పెద్దలు ప్రత్యేకమైన శ్రద్ధతో విద్యార్థుల మౌలిక వసతుల ఏర్పాటుకు, డిజిటల్ తరగతుల ఏర్పాటుకు కావాల్సిన తోడ్పాటునందేందుకు దాతలు ముందుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.గణేష్, పి.గోపాల్‌రెడ్డి, కె.కృష్ణ,ఎస్.స్వర్ణలత, సామాజిక కార్యకర్త వేముల సైదులు, కన్నెబోయిన బాలకృష్ణ, బాలకృష్ణ, మత్స్యగిరి, మన్విత, అక్షిత తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
బుధవారం | ఫిబ్రవరి 12, 2025 | www.navatelangana.com

## 34 అంగన్వాడీ భవనాలకు మరమ్మతులు



- పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ ఆదేశాలు
- ఐసీడీఎస్ పీఓ మమత


**నవతెలంగాణ-మిర్యాలగూడ**

మిర్యాలగూడ సమీకృత శిశు, మహిళా సంక్షేమ (ఐసీడీఎస్) అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ భవనాలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మరమ్మతు పనులు గ్రామపంచాయతీ కార్యదర్శుల అధ్వర్యంలో అత్యవసరంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారని మిర్యాలగూడ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో అంగన్వాడీ భవనం పెచ్చులుడిన సంఘటనతో అప్రమత్తమై మరమ్మతులు చేయాల్సిన భవనాలను గుర్తించాలని ఆదేశించడం జరిగిందని, గుర్తించామని తెలిపారు. మిర్యాలగూడ ప్రాజెక్టులో 34 భవనాలను గుర్తించినట్టు తెలిపారు. వాటిలో 32 భవనాలకు చిన్నపాటి మరమ్మతులు, 2 భవనాలకు స్లాబు ఇనుప చువ్వలు కనిపించేలా వున్నాయని మేజర్ పనులు త్వరలో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేఒర్కన్నారు.

## 'ఆర్టీసీ బాదుడు అన్యాయం'

**నవ తెలంగాణ-నేరేడుచర్ల**

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నేరేడుచర్ల మిర్యాలగూడ మధ్యన కేవలం 14 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి పల్లెవెలుగు బస్సు టికెట్ రూ.40 వసూలు చేయడం అన్యాయమని నేరేడుచర్ల బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేసి మాట్లాడారు. నేరేడుచర్ల నుండి మిర్యాలగూడకు కేవలం 14 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ అనాలోచిత నిర్ణయంతో 40 రూపాయలు టికెట్ వసూలు చేస్తూ సాధారణ మధ్యతరగతి ప్రజలను దోచుకుంటుందని అన్నారు. గతంలో మూసి పై వంతెన నిర్మించిన సమయాన టోల్గేట్ ఏర్పాటు చేసి పది రూపాయలు అదనంగా వసూలు చేశారని దాని కాలపరిమితి అయిపోయినదని నేడు రోడ్డు విస్తరణలో అదే ప్లేస్‌లో మరో టోల్గేట్ ఏర్పాటు చేశారని అప్పటి నుండి అదనంగా వసూలు చేస్తున్న ఆ పది రూపాయలే ఇప్పుడు వీరు తీసుకుంటే సరిపోయేదని మరో 10 రూపాయలు వడ్డించడంతో ప్రజలకు మోయలేని భారం ఏర్పడిందన్నారు. ధరలు తగ్గించకపోతే ప్రజాఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.




- రిజర్వేషన్ సర్వత్రా చర్చ...
- స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్ సిఫారసు ప్రభుత్వానికి నివేదిక
- ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత 73మండలాలు
- 73 జడ్పీటీసీ స్థానాలు, 722 ఎంపీటీసీస్థానాలు,1,730 పంచాయతీలు, 17500కు పైగా వార్డులు,
- స్థానిక ఎన్నికలకు అధికారుల కసరత్తు

# మా ఊర్లో ఏంది?

రాష్ట్రంలో ప్రస్తుతం స్థానిక ఎన్నికలపై ఆసక్తి చర్చ కొనసాగుతోంది. ఏ నాయకుడు కలిసిన, గ్రామాల్లో రచ్చబండపై కూర్చున్న ఏ నలుగురు కలిసినా మా ఊర్లో ఏంది రిజర్వేషన్?. ప్రభుత్వం కులగణన చేసింది. మా వర్గానికి లాభం చేకూరుతుందా? అనుకూలంగా రిజర్వేషన్ వస్తుందా?అనే మాట వినబడుతుంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం అధికారిక రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండకూడదు. దీంతో తాజా కులగణన నివేదిక ప్రకారం బీసీలకు 42శాతం సీట్లిస్తామని,జనరల్ స్థానాల్లో ప్రాధాన్యం పెంచుతామని కాంగ్రెస్ నేతలుచెబుతుండడంతో క్షేత్రస్థాయి నాయకుల్లో ఆసక్తికర చర్చసాగుతోంది.

**నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి**

ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత మండలాలు కలిపి మొత్తం73 మండలాల్లో 73 జెడ్పీటీసీ స్థానాలు, 722 ఎంపీటీసీస్థానాలకు 1,730 పంచాయతీలు, సుమారు 17500కు పైగా వార్డులకు,ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది నియామకానికిసన్నాహాలు పూర్తయ్యాయి. పరిషత్‌కు పార్టీలప్రాతిపదికన, గ్రామపంచాయతీలకు, వార్డు సభ్యులకు పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అందుకోసం వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ గుర్తులను సిద్ధం చేశారు. పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. అదేవిధంగా ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈనెల 15లోగా అన్ని రకాల శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు. పూర్తిచేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో ఈనెల 15 తర్వాత ఏ క్షణంలోనైనా ప్రభుత్వం ఆదేశిస్తే షెడ్యూల్ విడుదలవుతుందని అధికారులు అంచనావేస్తున్నారు.

**2019 లో రిజర్వేషన్ల కేటాయింపు ఇలా..**

2019లో జరిగిన ఎన్నికల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం స్థానికసంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు.ఈ నిబంధనకు లోబడి 2019లో జరిగిన గ్రామీణస్థానిక సంస్థల్లో సర్పంచుల పదవులకు 50శాతంలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తీసివేయగా బీసీలకు 22.78 శాతం రిజర్వేషన్లు దక్కాయి. మండల పరిషత్లలో 18.77 శాతం, జిల్లా పరిషత్లలో 17.11 శాతం వచ్చాయి. జెడ్పీటీసీ స్థానాలకు,ఎంపీపీ పదవులకు పంచాయతీరాజ్ కమిషనర్ స్థాయిలో జిల్లాల వారీగా కోటాను ఖరారు చేస్తే, జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో ఆ కోటా ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ కుఅనుగుణంగా సీట్లను కేటాయించారు. ఎంపీటీసీ స్థానాలకు, సర్పంచ్ పదవులకు కలెక్టర్ల స్థాయిలో మండలాలవారీగా కోటా ఖరారు చేసి, ఆర్డీవోల నేతృత్వంలో ఆయా మండలాల్లో సీట్లను కేటాయించారు.

**రిజర్వేషన్లు మారుతాయా?..**

రాష్ట్ర ప్రభుత్వం కులా గణన. ఆమోదించడంతో గతంలో మాదిరిగానే రిజర్వేషన్లు కొనసాగుతాయా? ఏ వర్గానికి లాభం చేకూరుతుందని సర్వతా ఆసక్తి నెలకొంది. దళితులకు కేటాయించిన తర్వాతనే మిగతావి బీసీలకు మిగిలిన రిజర్వేషన్లు అని చర్చ జరుగుతుండడంతో రిజర్వేషన్లు మారుతాయా అనే ఆసక్తి సర్వత నెలకొంది. ఈసారి రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఎలాంటి తుది నిర్ణయం తీసుకున్నామొత్తం రిజర్వేషన్ల కోటా 50శాతానికి మించకుండా నిబంధనలు రూపొందిస్తారని, ఆ మేరకు కోటా ఖరారు, సీట్లకేటాయింపు గతంలో మాదిరిగానే చేపడతారా? లేక కోటా ఖరారు, కేటాయింపులపై మార్పులు, చేర్పులు తీసుకుంటారా? అనే విషయం తేలాల్సి ఉంది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్ సిఫారసు ప్రభుత్వానికి నివేదిక రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం ఏర్పాటైన ప్రత్యేక (డెడికేటెడ్) కమిషన్ సోమవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన రిజర్వేషన్లపై నివేదిక అందజేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడి రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు సమాచారం. 50 శాతం రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీల పోనూ.. మిగతావి బీసీలకు రిజర్వు చేయాలని సిఫారసు చేసినట్లు తెలిసింది.

**ఆశావాహుల ఎదురుచూపులు...**

గత ఏడాది కాలం నుంచి ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఎట్టకేలకు అతి కొద్దిరోజుల్లోనే జరిగే అవకాశాలు ఉన్నాయ ని ఆశావాలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అధికారులు ఎన్నికల కోసం ఓటర్ల జాబితా, సిద్ధం చేయడం ఎన్నికల అధికారులకు శిక్షణను ఇవ్వడం దాదాపుగా ఈనెల 15లోగా పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తుంది. దీంతో కచ్చితంగా అతి త్వరలోనే ఎన్నికలు జరుగుతాయని మంత్రులు ఇప్పటికే తమ కేడర్ కు సంకేతికాలు ఇచ్చి ఉన్నారు.. అన్నిఅంశాలపై, వారంలోగా రిజర్వేషన్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామాలు, మండలాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీ సభ్యులుగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెంచుకున్న స్థానిక నాయకులు రిజర్వేషన్లు వారికి అనుకూలంగా వస్తేకదనరంగంలోకి దూకేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

## ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు స్టేజి -1, 2 అధికారులది కీలక పాత్ర

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి

**నవతెలంగాణ -నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి**




గ్రామపంచాయతీ ఎన్నికలలో రిటర్నింగ్ అధికారులు స్టేజి -1,2 అధికారులది కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె ఆదిత్య భవన్లో గ్రామపంచాయతీ ఎన్నికల స్టేజి వన్, స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో సొంత నిర్ణయాలను తీసుకోవద్దని, ఎన్నికల నియమ, నిబంధనల ప్రకారమే విధులు నిర్వర్తించాలని ఆమె తెలిపారు. ఎన్నికల లో ఎలాంటి పక్షపాతానికి ,బంధుప్రీతికి తావు లేకుండా పనిచేయాలని, ఒకవేళ ఎన్నికల్లో ఎవరైనా పొరపాట్లు చేసినట్లయితే ఎవరిని ఉపేక్షించడం జరగదని, రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది నేరుగా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పనిచేస్తుంటారని, అందువల్ల పూర్తి అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. నామినేషన్లు పరిశీలన, ఉపసంహరణ తోపాటు, అన్ని అంశాల పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి తప్పులు చేయవద్దని, ఏవైనా సందేహాలు ఉంటే ఎన్నికల అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని ఆమె చెప్పారు. అంతకుముందు జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల విషయమై 66 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, రిటర్నింగ్ అధికారులు హ్యాండ్బ్యాక్ ను బాగా చదువుకోవాలని, రిటర్నింగ్ అధికారులు చేయాల్సిన విధులపై చెక్ లిస్టును జాగ్రత్తగా పరిశీలించాలని ,ఎన్నికల సామాగ్రి మొదలుకొని అన్ని విషయాల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి నామినేషన్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, గృహ నిర్మాణశాఖ పిడి రాజకుమార్, మాస్టర్ ట్రైనర్ బాలు పాల్గొన్నారు.

## సమాజ హితం కోరేవారే జర్నలిస్టులు



- టీపీసీసీ డెలిగేట్ లెఫ్టికెనాల్ మాజీ చైర్మెన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి

**నవతెలంగాణ-కోదాడటౌన్**

సమాజ హితం కోరేవారే జర్నలిస్టులు అని టీపీసీసీ డెలిగేట్ లెఫ్టికెనాల్ మాజీ చైర్మెన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్య అతిథులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యొక్క ప్రతిభను వెలికి తీసేందుకు మంచి కార్యక్రమం నిర్వహించడం నిజంగా అభినందనీయమన్నారు. గత కొంతకాలంగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తప్పనిసరిగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సారథ్యంలో మీ కల త్వరలోనే సహకారం అవుతుందన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మెన్ వంగవీటి రామారావు మాట్లాడుతూ.. కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా వారితో తనకు విడదీయరాని పరిచయం ఉందని, తప్పనిసరిగా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని తెలిపారు. అనంతరం టీయూడబ్ల్యూజేహెచ్ 143 యూనియన్ జిల్లా అధ్యక్షులు వజ్జే వీరయ్య మాట్లాడుతూ.. జర్నలిజం కత్తి మీద సాము లాంటిదని ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా జర్నలిస్టుల సమస్యలు మారడం లేదన్నారు. అనంతరం సూర్యాపేట జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజనగౌడ్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం కోదాడ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్‌గా నియమితులైన ఏపూరి తిరుపతమ్మ సుధీర్ దంపతులను మీడియా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి హరి కిషన్, ఎంఈఓ సలీం షరీఫ్, ఎలక్ట్రాని మీడియా జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరావు, వంగవీటి శ్రీనివాసరావు, కోలిచలం నరేష్, సిరికొండ శ్రీనివాస్, సోమపంగు గణేష్, పూర్ణచంద్రరావు,యం లక్ష్మణ్,కె సైదులు, యం సురేష్, జి రాము, జి వెంకటనారాయణ, శేఖర్, గోపాల్, వాసు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడల మాజీ సర్పంచ్ రాజిరెడ్డికి నివాళులు

**నవతెలంగాణ-క్లాక్‌టవర్**



అనారోగ్యంతో మృతిచెందిన మామిడాల మాజీసర్పంచ్ కందిమల్ల. రాజిరెడ్డి పార్థీవ దేహనికి తన స్వగ్రామం యాపలగూడేంలో ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు సర్పంచ్‌గా రాజీరెడ్డి చేసిన సేవలను గుర్తుచేసి కుటుంబ సభ్యులకు రాజారెడ్డి లేని లోటు తీర్చలేనిది అని అన్నారు. తనతో పాటుగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పుచ్చకాయుల నర్సిరెడ్డి మండల కార్యదర్శి మన్నెం బిక్షం పాదూరి శ్రీనివాస్ రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

## గెజిటెడ్ సంతకాల కోసం లబ్దిదారుల ఇబ్బందులు

- సమాచార హక్కు సాధన సమితి జిల్లా కార్యదర్శి బోయ లింగస్వామి

**నవతెలంగాణ-మునుగోడు**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి పథకం పొందేందుకు లబ్ధిదారుల పరిస్థితి ఎక్కి సావు సుబ్బి పెళ్ళికి వచ్చిందన్న చందంగా తయారైంది అని సమాచార హక్కు సాధన సమితి జిల్లా కార్యదర్శి బోయ లింగస్వామి అన్నారు. బుధవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనాల ప్రకారం కళ్యాణ లక్ష్మి పథకం పొందేందుకు పదవ తరగతి సర్టిఫికెట్ , మొదటి పెళ్లి సర్టిఫికెట్ పై పరిశీలన చేసి గెజిటెడ్ సంతకం చేయాల్సిన అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు . గెజిటెడ్ సంతకం కోసం లబ్ధిదారులు రోజుల తరబడి గెజిటెడ్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి దాపరించిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇబ్బందులకు గురి చేయకుండా గెజిటెడ్ సంతకాలను చేసే విధంగా ఉన్నతాధికారులు ఆదేశాలను జారీ చేయాలని సూచించారు . లేనిపక్షంలో పెద్ద ఎత్తున లబ్ధిదారులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## జిల్లాస్థాయి కబడ్డీ ఆటల పోటీలు ప్రారంభం

**నవతెలంగాణ-నాంపల్లి**



నాంపల్లి మండల కేంద్రంలోని శ్రీరాధా రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి కబడ్డీ ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, ఏరెడ్ల రఘుపతి రెడ్డి, పూల వెంకటయ్య, పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, ఎస్కే చాంద్ పాషా, పానగంటి వెంకటయ్య, నాంపల్లి చంద్రమౌళి, ఎదుల్ల కోటి, పెద్దిరెడ్డి అనంతరెడ్డి, వీరమల్ల లవయ్య, వీరమల్ల నాగరాజు, కోరె శ్రీనివాస్, ఎస్.కె అబ్బాస్, ఎస్.కె రావూఫ్(చోటు), క్రీడాకారులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు

**నవతెలంగాణ-చిలుకూరు**

మండల కేంద్రంలో శ్రీ గోపయ్య సామెత లక్ష్మి తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా మంగళవారం దేవాలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తామని తెలిపారు.

## కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ కాంగ్రెస్ అండగా ఉంటుంది

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**నవతెలంగాణ-బొమ్మలరామారం**



స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయ డంకా మోగించాలని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బొమ్మలరామారం మండలంలోని మైసిరెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి గ్రామాల్లో ఎలాంటి మార్పు జరిగిందో నేరుగా గ్రామంలో కార్యకర్తలు నాయకులను ఆడిగితేలుసుకున్నారు.గ్రామాల్లో నాయకులు,కార్యకర్తలు అందరూ కలసికట్టుగా ఉండాలని సమన్వయ లోపం లేకుండా ఉండాలని వారికి సందేశమిచ్చారు.ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గ్రామాల్లో ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి మండలానికి ఎక్కువ నిధులు కేటాయించామని అన్నారు.మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. మరికొద్దిరోజులల్లో బొమ్మలరామారం మండలానికి గోదావరి జలాలను అందజేస్తామని అన్నారు.ప్రభుత్వం ఆరుగ్యారంటీలను విడతల వారీగా లబ్దిదారులకు అందజేస్తోందన్నారు.రైతు భరోసా,రైతు భీమా,ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి,రైతు రుణమాఫీ,ఉచిత విద్యుత్,రూ.500కె గ్యాస్,మహిళలకు ఉచిత బస్ సౌకర్యంతో పాటు ఇతర పథకాలు ప్రజలకు ఇస్తున్నామని గ్రామాల్లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నియమించిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి అత్యధిక స్థానాలను గెలిపించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాలివాహన సంఘం నూతన కమిటీ ఎన్నిక

**నవతెలంగాణ-తిరుమలగిరి**

తిరుమలగిరి మున్సిపాలిటీ శాలివాహన సంఘం నూతన కమిటీని ఆదివారం శాలివాహన కమిటీ హాల్ నందు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. వీరిలో అధ్యక్షులుగా పాలబిందెల యాదగిరి, ఉపాధ్యక్షులు పాలబిందెల శేఖర్, కార్యదర్శి పాలబిందెల. సోమయ్య, జాయింట్ సెక్రెటరీ పాల బిందెల రాములు, కోశాధికారి పాలబిందెల కొండయ్య, ప్రచార కార్యదర్శి పాల బిందెల వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్- పాలబిందెల మహేష్,గౌరవ సలహాదారులు పాలబిందెల శ్రీనివాసులు,పాలబిందెల సోమయ్య (లైబ్రరీ),పాలబిందెల సుభాష్,పాలబిందెల శేఖర్ (టీచర్), పాలబిందెల. వెంకన్న (టీచర్) పాలబిందెల మల్లయ్య,పాలబిందెల వీరస్వామి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు యాదగిరి మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధి కొరకు శక్తివంచన లేకుండా పాటుపడతానని దీనికి సంఘ సభ్యులు సహకరించాలని కోరారు.



## రంగరాజన్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

**నవతెలంగాణ-నకిరేకల్**

హైదరాబాదులోని చిలుకూరి బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని నకిరేకల్ గాయత్రి వైదిక బ్రాహ్మణ పరిషత్ సంఘం, అర్చక సంఘం ప్రతినిధులు తెలిపారు. రామరాజ్యం సభ్యులమని చెప్పి ఇలాంటి హేయమైన చర్యకు పాల్పడటం సనాతన వైదిక ధర్మం పై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. అర్చకులు రంగరాజన్ దశాబ్దాలుగా దేవాలయాల, హిందూ పరిరక్షణకు కృషి చేస్తున్నారని ని చెప్పారు. రంగరాజన్ పై దాడి చేసిన వారిని గుర్తించి తగిన శిక్ష విధించాలని గాయత్రి బ్రాహ్మణ వైదిక పరిషత్ నకిరేకల్ నియోజకవర్గం సభ్యులు రామలింగయ్య శర్మ మురళీధర్ శర్మ చంద్రయ్య శర్మ ,ఆనందు శర్మ భరద్వాజ్ శర్మ రఘు ,వంశీకృష్ణ,ఫణిశర్మ మధుసూదన్ శర్మ కోరారు. సిఎం రేవంత్ రెడ్డి స్పందన అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, దాడికి పాల్పడిన ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని తెలిపారు.

**చండూరు** :చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై జరిగిన దాడి చాలా హేయనీయమైనదని ఇలాంటి దాడులు సమాజ శ్రేయస్సుకు మంచిది కాదని మునుగోడు నియోజకవర్గం బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చిరువెల్లి ప్రవీణ్ శర్మ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి దాడిని ఖండిస్తున్నామని దాడి చేసిన వ్యక్తులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో బ్రాహ్మణులపై, అర్చకులపై దాడులు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.ఆయన వెంట కార్యదర్శి మాడ పాపయ్య శర్మ, కోశాధికారి వేమవరపు వెంకటరమణ శర్మ ఉన్నారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్‌బూత్ ముసాయిదా జాబితా విడుదల

**నవతెలంగాణ-చింతలపాలెం**

ఎంపీటీసీ, జెడ్పీటీసీల పోలింగ్ బూత్ ముసాయిదా జాబితాను మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారని ఎంపీడీఓ భూపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపు(13న) రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, 14న పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా తయారు చేసి, సంబంధిత ఎన్నికల అధికారికి తెలియ చేయడం, 15న అభ్యంతరం, వాదనలు కలెక్టర్ గారికి తెలపడం జరుగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లునిర్లక్ష్యం వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు

- ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి



నవతెలంగాణ-చండూరు

మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలనీ ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి అంగన్వాడీ కేంద్రాల టీచర్లను హెచ్చరించారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని గట్టుప్పల్, వెల్మకన్నె అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు ప్రీస్కూల్ కార్యక్రమాలు చేయటాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్లు లేకపోయినా, నిర్లక్ష్యం వ్యవహరించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచనలు చేశారు. పిల్లలకి అందించే ఆహార వివరాల పోషన్ యాప్ ను చెక్ చేశారు. ప్రీ స్కూల్ పిల్లలు చేసిన కార్యక్రమాల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు శివేష, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించండి

నవతెలంగాణ-నకిరేకల్



ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం పనిచేస్తానని తనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుండి పోటీ చేస్తున్న పన్నాల గోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక సామాన్య రైతు కూలీ కుటుంబం నుంచి వచ్చిన తనను ఉపాధ్యాయులు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. సమావేశంలో గుండెబోయిన నాగేశ్వరరావు, డాక్టర్ తోట నరసింహాచారి, నరేష్, పి.పవన్ పాల్గొన్నారు.

## పేపర్ ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడ్డ ఆనంద్ కుమార్ అరెస్టు

- మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



ప్రభుత్వ అధికారుల పైన తప్పుడు, అబద్దపు వార్తలు ప్రచురిస్తూ, అనంతరం వారిని బెదిరింపులకు గురి చేస్తూ, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న "క్రైమ్ మిర్రర్ ఈ-న్యూస్ పేపర్" స్టేట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అయిన నాగుల ఆనంద్ కుమార్ అలియాస్ ఆనంద్ ను నల్లగొండ పోలీసులు అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు. తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ."క్రైమ్ మిర్రర్ డిజిటల్ పేపర్"కు స్టేట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అయిన నాగుల ఆనంద్ కుమార్ అలియాస్ ఆనంద్, తనకు పరిచయస్తులైన తుప్పరి రఘు, పేరబోయిన ఆంజనేయులు అలియాస్ అంజి ల సహకారంతో, ఒక ముఠాగా ఏర్పడి, నల్లగొండ జిల్లాలోను, , వికారాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లోనూ, కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులను, వ్యాపారస్తులను లక్ష్యంగా చేసుకొని, అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో, తప్పుడు , కల్పిత సమాచారంతో క్రైమ్ మిర్రర్ డిజిటల్ పత్రికలో ప్రచురణలు చేసి, అసత్య ప్రచారం చేసి, వారిని బెదిరించి డబ్బులు సంపాదించారు. గతంలో నల్లగొండ జిల్లా హెడ్ క్వార్టర్ లో గల డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసు లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ గా విధులు నిర్వహించిన ఎస్సీ కులానికి చెందిన కొంపల్లి మత్స్యగిరి, పారా మెడికల్ యూనియన్‌లో వారి డిపార్టెంట్ సమస్యల పరిష్కారాలకు చురుకుగా పని చేస్తున్నాడని, అతనిని తమ లక్ష్యంగా ఎంచుకొని గతేడాది జులై 27న డీ ఎం హెచ్ ఓ ఆఫీసు సిబ్బంది పైన, పరోక్షంగా మత్స్యగిరి పైనా అక్రమాలకు పాల్పడుతున్నట్లు అర్థం వచ్చే విధంగా "ప్రభుత్వ ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు కుచ్చు టోపీ" అనే శీర్షికతో తమ క్రైమ్ మిర్రర్ పేపర్ లో ప్రచురించి, సోషల్ మీడియా లో కూడా వైరల్ చేశారు. అనంతరం సదరు మత్స్యగిరి ని వాట్సాప్ కాల్స్ ద్వారా అతనిని సంప్రదించి, నాలుగు లక్షల రూపాయలు ఇవ్వాలని, లేదంటే నీ అంతు చూస్తాం అని బెదిరించారు. బాధితుడు తనను వదిలిపెట్టండి అని వేడుకొన్నప్పటికి, వినకుండా పదేపదే ఫోన్లు చేస్తూ డబ్బులు ఇవ్వాలని వేధించగా. వారి వేధింపుల నుండి తప్పించుకోవడానికి బాధితుడు మత్స్యగిరి ఆగస్టు1న 50వేలు గూగుల్ పే ద్వారా పంపించాడు.మళ్ళీ ఫోన్లు చేసి బెదిరించగా, మరొక నలభై వేలు ఇచ్చాడు. ఇటీవల వారి ఆగడాల గురించి వచ్చిన సమాచారం సోషల్ మీడియాలో చూసి, బాధితుడు ఈనెల2న నల్లగొండ వన్ టౌన్ పోలీసు స్టేషన్ లో తనకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదు చేశాడు. క్రైమ్ నంబర్: 27/2025 సెక్షన్. 308(2), 308(5), 351(2) R/w 3(5) of బి ఎంఎస్ సెక్షన్ 3(2)(v)(va) ఎస్సీ ఎస్టీ (పి ఓ ఏ) -2015 ప్రకారం కేసు నమోదు చేశారు. నల్లగొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి, పరిశోధన చేసి, సాక్ష్యాధారాలు సేకరించి, సోమవారం ప్రధాన నిందితుడు అయిన నాగుల ఆనంద్ కుమార్ ను పట్టుకున్నారు. అతని వద్ద నుండి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు. సదరు నేరస్థుడి విచారణలో, మరికొన్ని దురాగతలు వెలుగులోకి వచ్చినాయి. మిగతా ఇద్దరు నేరస్తులను, వీరబాబు, సీఐమిర్యాలగూడ రూరల్ ను కూడా ఇదే విధంగా వేధించి, భయపెట్టి రెండు లక్షలు డిమాండ్ చేసిన, కేసుకు సంబంధించి, మిర్యాలగూడ టూ టౌన్ లో నమోదు అయిన కేసులో ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ ముఠా నల్లగొండ జిల్లాలో ఇంకా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులను వేధించి, భయపెట్టి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం వున్నది. కొన్ని చోట్ల కేసులు కూడా నమోదు అయి విచారణలో వున్నాయి. నిందితుడు ఆనంద్ కుమార్ ఇదే విధంగా వికారాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఇంకా పలు జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడని తెలుస్తుంది. మొదటి ఇద్దరు నిందితుల అరెస్టు తర్వాత, మిగతా బాధితులు కూడా ఇప్పుడు ఒక్కొక్కరుగా పోలీసు వారిని సంప్రదించి ఫిర్యాదులు చేస్తున్నారు.

## రైతు భరోసాకు అడ్డంకులు తొలగేనా ?

- రైతులకు ఒక్కతీరుగా పడని భరోసా డబ్బులు
- సాంకేతిక లోపాలున్నాయంటున్న అధికారులు

నవతెలంగాణ-నూతనకల్



కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు తమ మేనిఫెస్టోలో రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ భూమికి పెట్టుబడి సహాయంగా ఎకరాకు కారుకు రూ.7500 అందిస్తామని ప్రకటించారు. అనంతరం ప్రభుత్వం ఏర్పడినంక మేనిఫెస్టోను సవరించి రూ.6వేలు అందిస్తామని అన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాలలో రైతులకు ఒక్క ఎకరానికి రూ.6వేల చొప్పున కలిగిన రైతులకు ఖాతాలో జమ చేస్తూ వస్తున్నారు. 2 ఎకరాల భూమి కలిగిన రైతులకు ఒక్క ఎకరం ఒక్క గుంటకు రూ.6,500 మాత్రమే రైతు ఖాతాలో జమఅయ్యాయి. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి ఒక ఎకరం మూడు గంటల వ్యవసాయ విస్తీర్ణ సాగుభూమి, ఎకరం 30 గుంటలకు రూ.4500 మాత్రమే జమ అయినట్లు తెలిపారు. మిగతా సాగు భూమికి పెట్టుబడి సాయం అందేనా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక రైతు వ్యవసాయ విస్తరణ అధికారికి ఫోన్ ద్వారా సంప్రదించగా సర్వే చేసి సంబంధిత అధికారులకు నివేదిక పంపామని సాంకేతిక లోపాలు ఉన్నాయని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు.

**సాంకేతిక సమస్యలతోనే జమకాలేదు: తహశీల్దార్**

రైతు భరోసా పడకపోవడంపై కొందరు రైతులు తహసీల్దార్ శ్రీనివాసరావును సంప్రదించగా.. రైతు పాసుబుక్కులు కంప్యూటర్లో పరిశీలించి సాగు విస్తీర్ణం సరిగ్గా ఉందని, సాంకేతిక లోపం ద్వారానే జమకాలేదని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

**మొత్తం భూమికి ఒకేసారి భరోసా కల్పించాలి: బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పులుసు లింగ మల్లయ్య**



రైతు యజమాన్యంలో ఉన్న మొత్తం భూమికి ఒకేసారి రైతు భరోసాలు రైతు ఖాతాలో జమ చేయాలని సంబంధిత అధికారులను బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పులుసు లింగం మల్లయ్య డిమాండ్ చేశారు. రైతుకు రెండు ఎకరాలు ఉంటే ఒక్క ఎకరం వరకే రైతు భరోసా పడడం అన్యాయమని వెంటనే సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**అధికారులు నిర్లక్ష్యం వీడాలి: గడ్డం పాపయ్య (రైతు)**

కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా రైతు భరోసాను ఎటువంటి నియమ నిబంధనలు లేకుండా రైతుల ఖాతాలో జమ చేసే బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నది. సంబంధిత వ్యవసాయ రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడి పెట్టుబడి సహాయాన్ని వెంటనే అందించాలి.

## యాసంగి ధాన్యం సేకరణపై సన్నాహక సమావేశం

- కలెక్టర్ హనుమంతరావు

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్



యాసంగి(రబీ) 2024-25కు సంబంధించి ధాన్యం సేకరణ గురించిన సన్నాహక సమావేశం మంగళవారం రాయగిరిలోని లింగ బసవగార్డెన్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడారు.ఖరీఫ్ పంట కాలంలో ధాన్యం సేకరణ సజావుగా జరిగిందన్నారు. రానున్న యాసంగి పంట కాలంలో అధిక దిగుబడి రానున్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ఇప్పటినుంచి ధాన్యం సేకరణకు సంబంధించిన సన్నాహాలు చేయాలని సూచించారు.గత సీజన్ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు తల ఎత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఏజెన్సీ అధికారులు మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని, గ్రామస్థాయిలో క్రమపద్ధతిన దశలవారీగా కోతలు జరిగే టందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దాని కొరకు హార్వెస్టర్ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేయమని సూచించారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌లో గత సీజన్ కంటే రెట్టింపు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నందున దానికి తగ్గట్టుగా ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో మిల్ పాయింట్లలో సరిపడు హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రానున్న వేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో మంచినీటి వసతి, టెంట్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సీజనల్‌లో అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి కేంద్రం కు అనువైన ఎగువ ప్రాంతంలో ఉన్న స్థలాన్ని గుర్తించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ఒక్కొక్కరికి 30 చొప్పున టార్పాలిన్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ వారికి సూచించారు. జిల్లాలో సుమారు 395 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి వచ్చిన ధాన్యాన్ని క్రమ పద్ధతిలో తగు నాణ్యత పరిమాణాలతో తీసుకోవాలన్నారు. కేంద్రం నిర్వహణలో బుక్ కీపింగ్ ,ట్యాబ్ ఎంట్రీ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. ధాన్యం చెల్లింపుల విషయంలో వెనువెంటనే ఓపీఎంఎస్‌లో ట్యాబ్ ఎంట్రీ చేసి రైతులకు 48 గంటల్లో వారి ఖాతాలకు డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీధర్, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి సాయికృష్ణ, జిల్లా కోపరేటివ్ అధికారి రవీందర్, సహాయ పౌర సరఫరాల అధికారిణి రోజా, జిల్లాలో కొనుగోలు కేంద్రనిర్వాహకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పరిషత్.... తరువాతే పంచాయతీ

- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు
- ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నాలు
- రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ
- మండలంలో 23 గ్రామ పంచాయతీలకు జెడ్పీటీసీ స్థానం, 10 ఎంపీటీసీ స్థానాలు

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

పల్లె పోరుకు అధికారయంత్రం సిద్ధమవుతుంది. నోటిఫికేషన్ క్షణాన వచ్చిన నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఓకే చెప్పడంతో పల్లెపోరుకు అధికారులు సిద్ధమవుతున్నారు త్వరలో ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది ముందుగా ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలు నిర్వహించి ఆ తర్వాతే సర్పంచ్ ఎన్నికలకు నిర్వహించనున్నట్లు సమాచారం. గ్రామాలలో సర్పంచుల పాలన పూర్తయి ఏడాది గడిచింది. అప్పటి నుంచి ప్రత్యేకఅధికారుల పాలన కొనసాగుతుంది. ఇప్పుడు ఎన్నికల నిర్వహణలకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. మొదట మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు, ఒకటి జెడ్పీటీసీ స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి.మండలంలో పోచంపల్లి మున్సిపాలిటీలో పోచంపల్లి మేజర్ గ్రామపంచాయతీ రేవనపల్లి ముక్తాపూర్ గ్రామపంచాయతీలను కలిపి పోచంపల్లి మున్సిపాలిటీగా ఏర్పడింది. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలతో కలుపుకొని 23 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి గ్రామాలలోని ఎన్నికల వాతావరణం సందడి నెలకొన్నది.గ్రామాలలోని ప్రజల దృష్టిని మళ్లించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. తాము పోటులో ఉంటామని సంకేతాలు వస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రజలు పేరున్న తాజా మాజీలు మళ్ళీ ప్రజల మధ్య ఉంటుండగా మరికొన్ని చోట్ల అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రయత్నాలు తమదేని తాము ఉంటేనే పనులవుతాయని ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు.ఒక్కో గ్రామాలలో నలుగురు ఐదుగురు ప్రయత్నాలు చేస్తున్నారు.గత బీఆర్ఎస్ పాలనలో రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో



అదే పార్టీకి చెందిన మద్దతు దారులే సర్పంచులు గా 90 శాతం గెలుపొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఈసారి తమను ఆదరిస్తారని కాంగ్రెస్ నాయకులు ప్రజలకు దగ్గర ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. స్థానికంగా ఉండి నిస్వార్థంగా గ్రామానికి ప్రజలకు సేవ చేసే వారికే ఓటేద్దాం. అలాంటి వారిని గెలిపించుకుందాం ప్రతి నోటా ఇదే మాట వినబడుతుంది ఇలాంటి శపదాలు మాటలు వరకే మిగిలిపోతున్నాయి. తీరా ఎన్నికలలో ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి ఓట్లు వేస్తున్న పరిస్థితి కన పడుతుంది.రిజర్వేషన్లు మారుతాయా మారితే తమ పరిస్థితి ఏంటి మారకపోతే ఏంటి అని ఎవరికి వారు ఆశావహుల్లో లెక్కలు వేసుకుంటున్నారు.ఎంపీటీసీ అవకాశం దొరకకపోతే సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా ఏదో ఒకటి పోటీ చేయాల్సింది చేసి తీరుతా.తాము ఆశించిన పార్టీ అవకాశమిస్తే సరే లేదంటే స్వతంత్రంగానైనా పోటీ చేసే తీరుతాం..తగ్గేదేలే అంటూ శపథాలు చేస్తున్నారు.

**గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యతిరేకత**

కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు రైతు భరోసా, రైతురుణమాఫీ, పెన్షన్లు, ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం., ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు హడావుడి చేసి గాలికి వదిలేసిన పరిస్థితి గ్రామాలలో ప్రజల్లో వ్యతిరేకత బలంగా ఉంది.ఎన్నికలలో ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారు వేచి చూడాల్సి ఉంది.ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ(ఎం), బీజేపీ అభ్యర్థులు నిలిచేందుకు సిద్ధమవుతున్నారు.

**రిజర్వేషన్లపై ఉత్కంఠ**

రిజర్వేషన్లపై ఉత్కంఠ స్థానికసంస్థల ఎన్నికలకు ముందే కులగణన సర్వే లెక్కలు విడుదల చేసింది.తప్పుల తడకగా సర్వే చేశారంటూ బీసీలు మండ పడుతున్నారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణపై కూడా మాదిగ మాల సామాజిక వర్గాల ఎవరికి వారు అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు ఏ విధంగా కేటాయిస్తారు పాతవే కొనసాగిస్తారా? కొత్తవి నిర్వహిస్తారా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.అయితే ఎలాగైనా త్వరలోనే ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆశాహులు సంఖ్య గతంలో పోలిస్తే భారీగా పెరిగింది. గతంలో ఉన్న రిజర్వేషన్లు గ్రామ జనాభా రొటేషన్ పద్ధతిలో ఎవరికి ఇస్తా రో అంటూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 22 మంది అభ్యర్థుల నామినేషన్ల ఆమోదం

- తుండు ఉపేందర్ నామినేషన్ తిరస్కరణ

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి




వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకులు, రాష్ట్ర పర్యావరణ, అటవీ,సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ సమక్షంలో నిర్వహించారు. . నల్గొండ జిల్లా కలెక్టర్ మరియు వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో ఈ నెల 3 నుండి 10 వరకు స్వీకరించిన నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. . సోమవారం నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా, నామినేషన్ల సమయం ముగిసిన తర్వాత మొత్తం (23 )మంది అభ్యర్థులు( 50) నామినేషన్ సెట్లను దాఖలు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం నామినేషన్ల పరిశీలన సందర్భంగా ఇండిపెండెంట్ అభ్యర్థి తుండు ఉపేందర్ నామినేషన్ పత్రాలపై సంతకం లేని కారణంగా రిటర్నింగ్ అధికారి ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. దీంతో వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 22 మంది అభ్యర్థులు నిలిచారు. నల్గొండ అదనపు కలెక్టర్ మరియు వరంగల్ - ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులు ఉన్నారు.

## ప్రేమించలేదని యువతిపై పెట్రోల్ పోసి హత్యాయత్నం

నవతెలంగాణ-హుజూర్‌నగర్



ఖమ్మం జిల్లా మోటమర్రి గ్రామానికి చెందిన 23ఏండ్ల యువతి హుజూర్‌గర్ పట్టణంలోని మేనమామ ఇంటి వద్ద ఉండి కోదాడ రోడ్డు నందు గల దీపెన్ఏఐ ఆఫీసు నందు ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటుంది. అదే మోటమర్రి గ్రామానికి చెందిన సుందర్ ప్రమోద్ కుమార్ అనే యువకుడు మంగళవారం బాధితురాలికి ఫోన్ చేసి మాట్లాడాలి రమ్మని కోరగా ఆమె ఆఫీస్ బయటకు వచ్చింది. తనను ఎందుకు ప్రేమించడం లేదని వెంట తెచ్చుకున్న పెట్రోలు ఆమెపై చల్లి చంపడానికి ప్రయత్నించాడు. ఈ మేరకు యువతి ఎస్ఐకి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్తయ్య తెలిపారు.

## జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-నాంపల్లి



నల్లగొండ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వై.శేఖర్‌రెడ్డి మంగళవారం నాంపల్లి మండలం లోని మహమ్మదాపురం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి ఉపాధి హామీ పనుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు జరగ కపోవడంతో శుక్రవారం వరకు పనులు మొదలు పెట్టకపోతే ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో నీటి నిలువ పనులు, రైతులకు ఉపయోగపడే రోడ్డు నిర్మాణ పనులు, పండ్ల తోటల పెంపకం వంటి పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి రోజు కూలీలకు రూ.300 వేతనం వచ్చే విధంగా కొలతలు ఇచ్చి పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఫిబ్రవరి చివరి నాటికి అన్ని నర్సరీల్లో వందశాతం స్థానికంగా దొరికే విత్తనాలతో గ్రామ అవసరాలకు అనుగుణంగా మొక్కలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గుంటుక వెంకటేశం, ఈసీ లింగయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు ఈశ్వరయ్య, అంజయ్య, భాస్కర్, నాగయ్య, పంచాయతీ కార్యదర్శి అజయ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శ

నవతెలంగాణ-నకిరేకల్



అనారోగ్యంతో బాధపడుతు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న 17వ వార్డుకి చెందిన కొండ రాములును నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. 6వ వార్డుకి చెందిన గుల్లోజు పాపయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. 6వ వార్డుకి చెందిన కొండ లింగయ్య అనారోగ్యంతో మరణించగా వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనారోగ్యంతో బాధపడుతు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న 19వ వార్డుకి చెందిన చెవుగోని సైదులు, చెవుగోని వెంకన్నలను పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. 18వ వార్డుకి చెందిన చిన్నెని సైదులు ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుడంగా వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## రాములమ్మకు సీపీఐ(ఎం) నాయకులు ఘన నివాళి

నవతెలంగాణ-మునుగోడు



మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పగిళ్ల కృష్ణయ్య సతీమణి రాములమ్మ అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భౌతికానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం తమ కుటుంబం సీపీఐ(ఎం) బలోపేతం కోసం చేసిన కృషి ఎలా లేందని కొనియాడారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ సీపీఐ(ఎం) అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చాపల మారయ్య, నారగోని నరసింహ, బొందు పెద్ద అంజయ్య, బొందు చిన్న నరసింహ, పగిళ్ల కృష్ణయ్య, పగిళ్ల రాజా, పగిళ్ల ప్రవీణ్, పగిల పరమేష్, పగిళ్ల వెంకటయ్య, పగిళ్ల తేజ తదితరులు ఉన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



నవతెలంగాణ-నకిరేకల్

నకిరే కల్ మున్సిపాలిటీ పరిధిలోని బాబాసాహెబ్‌గూడెంలో నిర్మాణంలో ఉన్న ముత్యాలమ్మ గుడికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజ్ రూ.20 వేల 116ల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఎల్లపు రెడ్డి సైదిరెడ్డి, వెంకటనారాయణగౌడ్, శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## లింగయ్య గౌడ్ మృతికి నివాళి

నవతెలంగాణ-నకిరేకల్



నకిరే కల్ మున్సిపాలిటీ 6వ వార్డు చీమలగడ్డకు చెందిన కొండ లింగయ్య గౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా నకిరేకల్ కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కొండ జానయ్యగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ కమిటీ సభ్యులు కొండ యాదగిరిగౌడ్, కొండ శ్రీనుగౌడ్, చౌగోని వెంకన్నగౌడ్, కొండ వెంకన్నగౌడ్, కొండ రాములుగౌడ్, కొండ వెంకన్నగౌడ్, కప్పల రవిగౌడ్, పలుస సైదులుగౌడ్, కొండ వెంకటేశ్వర్లుగౌడ్, కొండ అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.



## వీధి కుక్కల దాడి 9 గొర్రెలు మృత్యువాత

నవతెలంగాణ-మోటకొండూరు

గొర్రెల కాపరి తొట్టె మల్లయ్య కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామం తొట్టె మల్లయ్య గొర్రెల మందపై సోమవారం రాత్రి వీధికుక్కలు దాడి చేయగా 9 గొర్రెలు మృత్యువాత పడ్డాయి.ఈ సందర్భంగా ఆయన చనిపోయిన గొర్రెలను పరిశీలించి మాట్లడారు. మరికొన్ని గొర్రెలకు తీవ్ర గాయాల య్యాయి. రూ.లక్ష ఆర్థిక నష్టం జరిగిం దని. చనిపోయిన ఒక్కో గొర్రెకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవాలను గ్రామ పంచాయతీ, పశుసంవర్ధకశాఖ అధికారులు రికార్డుల్లో నమోదు చేయాలని, గాయపడిన జీవాలకు పశు సంవర్ధక శాఖ అధికారులు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి చనిపోయిన ఒక్కో గొర్రెకు రూ.10వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఉపాధి హామీ చట్టంలో గొర్రెలషెడ్ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో ప్రవేశ పెట్టిన గొర్రెల బీమాపథకం అమలు కావడం లేదన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్రెల కాపరులకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.

## విద్యా రంగ సమస్యలను పరిష్కరించే వరకు పోరాడుతాం

నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్




విద్యా రంగ సమస్యలపే పరిష్కరించే వరకు పోరాడుతామని ఎస్ఎఫ్ఐ నాగార్జున సాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి లు నల్లబెల్లి జగదీష్ ,కోరే రమేష్ అన్నారు. మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల మహాసభను మండల కేంద్రంలోని శ్రీనివాస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని, విద్యార్థులకు అందవలసిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతూ విద్యార్థుల పైన కపట ప్రేమ చూపిస్తుందన్నారు. మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా పాఠశాలకి సొంత భవనం లేక విద్యార్థులు అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్నా నూతన భవనం కడుతున్నామని కాలయాపన చేస్తున్నారన్నారు. బీసీ బాయ్స్ హాస్టల్ కి కూడా సొంత భవనం లేక అద్దె భవనంలో ఉంటున్న పరిస్థితి వీరికి వెంటనే సొంత భవనం నిర్మించాలన్నారు. అనంతరం నూతన అధ్యక్ష కార్యదర్శి లను ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సాయి, కార్యదర్శిగా నవీన్ కమిటీ సభ్యులుగా దత్తు, తేజ, దివ్య, కీర్తనలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలోకల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వేములకొండ పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జటావత్ రవి, సిఐటియు తిరుమలగిరి మండల కార్యదర్శి షేక్ చాంద్ బాషా, వర్షిత్, అంజి, శివ పాల్గొన్నారు.

## బీజేపీ పాలనలో.. పెరిగిన రైతు ఆత్మహత్యలు

నవతెలంగాణ-గరిడేపల్లి



బీజేపీ పదేండ్ల పాలనలో రైతు ఆత్మహత్యలు పెరిగాయాని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్కే యాకూబ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని యంయస్ భవన్‌లో ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశం యానాలా సోమయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్న వ్యవసాయానికి సబ్సిడీలు మొత్తం ఎత్తేసి కార్పొరేటర్ల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. రైతాంగానికి ఉత్పత్తికయ్యే ఖర్చు కంటే మరో 50శాతం కలిపి రైతాంగానికి ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ సిఫారులు చేస్తే అది చెత్తబుట్టలో పడేశారని అన్నారు. పంటలు నష్టాలు వస్తే ప్రధానమంత్రి ఫసల్ బీమా మాటలకే పరిమితమైందని అన్నారు. ఒక్క డీఏపీ కట్టపై 630 రూపాయలు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రులు చేసిన అప్పు 56 లక్షల కోట్లు అయితే పది సంవత్సరాలుగా నరేంద్రమోడీ గారు చేసిన అప్పు 114 లక్షల కోట్లు అని ఆకుపన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య దోసపాటి బిక్షం బొల్లిపల్లి శ్రీనివాస్ యమగాని వెంకటేశ్వర్లు మండవ సైదులు సారెడ్డి సైదిరెడ్డి యనాల సోమయ్య మాజీ ఎంపీటీసీ యానాల సుశీల రాయిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌లో గెలుపొందిన విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్

**నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్**

యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని శ్రీ సాయిప్రశాంతి విద్యానికేతన్ విద్యార్థులు న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగవ ఇంటర్నేషనల్ ఆల్‌స్టైల్స్ మార్షల్ షాట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్స్ సిల్వర్‌ఆర్ట్స్ చాంపియన్‌షిప్ మెడల్స్ సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ తోటకూరి యాదయ్యయాదవ్ తెలిపారు. కాగా మంగళవారం రోజున నాలుగో ఇంటర్నేషనల్ ఆల్ స్టైల్స్ మార్చల్స్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలో హైదరాబాదులోని సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో ఫిబ్రవరి 9వ తేదీన నిర్వహించగా, శ్రీ సాయిప్రశాంతి విద్యానికేతన్ కు చెందిన 9వ తరగతి విద్యార్థి తోగరు జస్వంత్‌వర్మ ఇంటర్ 14వ బాలుర విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు, మరొక విద్యార్థి అండర్ 12 బాలికల విభాగంలో తోగరువర్షిని సిల్వర్ మెడల్ సాధించి నట్లు తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన ప్రదర్శించి మెడల్స్ సాధించిన సందర్భంగా పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తోటకూరి యాదయ్యయాదవ్ మాట్లాడుతూ తోటి విద్యార్థులు వీరిని ప్రేరణగా తీసుకొని ప్రతి ఒక విద్యార్థి ఏదో ఒక రంగంలో తమ ప్రతిభకనబరచాలని సూచించారు.విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

### సీపీఐ సీనియర్ నాయకుని మృతి

**నవతెలంగాణ-రాజపేట**

సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ మండల కార్యదర్శి గవ్వల భిక్షపతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు భిక్షపతి సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు.మృతుని కుటుంబసభ్యులకు కొల్లూరు రాజయ్య, చిగుళ్ల లింగం, జీడిపల్లి ఉప్పల్‌రెడ్డి, పండుగపెద్దులు, శివ లీల, భాషమైన రవి, తదితరులు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బోళ్ల కొండల్‌రెడ్డి, ఊట్కూరి అశోక్ గౌడ్, సిల్వేరు బాలరాజుగౌడ్, శీతల వీరయ్య, కాలే నర్సింహులు, మేక రమేష్, చీర మహిపాల్, సిద్దేశ్వర్, బాలస్వామి, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### రోజురోజుకు పెరుగుతున్న ఎండిన పంట పొలాలు

**నవతెలంగాణ-రాజపేట**

ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని రాజపేట మండల రైతులకు సాగునీరందివ్వాలని, గొలుసుకట్టు చెరువులను నింపాలని రాజపేట మండల రైతు జేఏసీ మంగళవారం డిమాండ్ చేసింది. మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, పీఏసీఎస్ వైస్‌చైర్మెన్ ఉపేందర్ మాట్లాడుతూ రైతులను మోసం చేయడంలో ఈ ప్రభుత్వం ముందంజలో ఉందని తెలిపారు. గొల్లపల్లి శ్రీనివాసు మూడెకరాలు నాటుపెట్టగా తన బోరు ఎండిపోవడంతో ఎండిన తన పొలంలో తిరుగుతూ ఏడుస్తున్నాడన్నారు.రాజపేట ప్రాంతానికి సాగు నీరొస్తేనే ఈ రైతులంతా బాగుపడతారన్నారు. వేసవికాలం రాకముందే భూగర్భ జలాలు అడుగంటి పోయాయని తెలిపారు. రైతు గొల్లపల్లి శ్రీనివాస్‌తో సహా మిగతా రైతులకు ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండే విధంగా ఈ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారన్నారు.

### అభ్యంతరాలు తెలియజేయాలి: ఎంపీడీఓ

**మునగాల:** ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటుపై ఎమైనా అభ్యంతరాలు వుంటే నేటి నుంచి రేపటి వరకు తెలియ జేయాలని ఎంపిడిఓ రమేష్ దీన్ దయాళ్ తెలిపారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆమోదంతో పోలింగ్ కేంద్రాల జాబితాను కార్యాలయంలో ప్రదర్శించారు. 13వ తేదీ మండల పొలిటికల్ పార్టీ మండల అధ్యక్షులు కార్యదర్శులకు సమావేశం నిర్వహించి వారి సూచనలు తీసుకుంటామని చెప్పారు. 14వ తేదీన అభ్యంతరాలు స్వీకరించి కలెక్టర్ అనుమతికి పంపిస్తామని తెలిపారు. కలెక్టర్ ఆమోదంతో 15న తుది జాబితా పోలింగ్ కేంద్రాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిఓ దారా శ్రీను, ఏపీఓ శైలజ, మొలుగూరి రమేష్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పత్రికలు ప్రజాసమస్యలను వెలికితీయాలి

**నవతెలంగాణ-హుజూర్‌నగర్**

ప్రజాసమస్యలను వెలికితీయడంలో పత్రికలు ముందుండాలని ఆర్డిఓ శ్రీనివాసులు అన్నారు మంగళవారం ఐజేయు ఆధ్వర్యంలో ముద్రించిన ప్రెస్ క్లబ్ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమకార్యక్రమాలను ప్రజల్లోకి మరింత ముందుకుతీసుకెళ్లాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రకాష్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వర రావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిల్లలమర్రి శ్రీనివాస్, జానీభాష, కీతరా మనాథం శ్రీనివాసచారి, దేవవరం రామిరెడ్డి, అంజయ్య, ఇందిరాల రామకృష్ణ, ఇట్టి మల్ల శ్రీనివాస్ ఉన్నారు.

### డాన్‌బోస్కో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ విదేశీ పర్యటన

**నవతెలంగాణ-చండూరు**

స్థానిక డాన్ బోస్కో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ రాజేశ్ అంతర్జాతీయ డాన్ బోస్కో మహా సభలు (29వ జనరల్ చాప్టర్) ఇటలీలోని ట్యూరిన్, రోమ్ నగరాలలో జరగబోయే వాటిలో పాల్గొనేందుకు గాను వెళ్తున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బాలశౌరి రెడ్డి, ఆధ్యాపక బృందం, విద్యార్ధిని విద్యార్థులు ఫాదర్ రాజేశ్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఫాదర్ మాట్లాడుతూ డాన్ బోస్కో సంస్థలు ప్రపంచంలో నేడు 147 దేశాలలో యువతకు విద్యా, సామాజిక, సాంస్కృతిక సేవలను అందిస్తూ ఎంతో మందికి చేయూతను అందిస్తుందని ఈ నెల 16వ తేదీ నుండి జరగబోయే అంతర్జాతీయ మహా సభలలో పాల్గొనే అవకాశం రావడం అదృష్టమని, ముందు ముందు ఈ సంస్థ ద్వారా చండూర్, నల్లగొండ జిల్లా లో విస్తృత మైన సేవలు అందించుటకు కృషిచేస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ఆధ్యాపకులు విధ్యార్థులు పాల్గొన్నారు.

### అట్టహాసంగా ప్రారంభమైన తిరుమల నాథ స్వామి ఉత్సావాలు

**నవతెలంగాణ-పెద్దవూర**

నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం పెద్దవూర, తిరుమల గిరి సాగర్ మండలాల పరిధిలోని బోనూతల (కోనేటిపురం )హాలియా నుండి సాగర్ వెళ్ళే మార్గంలో కుంకుడుచెట్టుతండ గ్రామం తూర్పువైపున తిరుమల కొండపై వెలసిన తిరుమలనాథ స్వామి జాతర ఉత్సావాలు మంగళవారం అట్ట హాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మెన్ కల్లూరీ వెంకటేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మెన్ దండు బిక్షం ఆధ్వర్యంలో రాయప్రోలు మురళీ గురుస్వామి అయ్యగారు 108 కలశములచే పద్మావతి సమేత తిరుమలనాథస్వామి వారికి అభిషేకం ఘనంగా నిర్వహించారు.సాయం కాలం సహస్ర దీపాలంకార సేవ అర్చకులు వైభవంగా నిర్వహించారు.అర్చకులు వెంకట్ నారాయణ శర్మ,మాజీ సర్పంచులు తుమ్మల పల్లి లలిత వెంకట్ రెడ్డి,తుమ్మపల్లి సుధాకర్ రెడ్డి,మెండే విష్ణుప్రియ సైదులు,గగ్గెనా పల్లి సాంబా రెడ్డి, తిరుమల యాదవ్ పగడాల, వడ్ల పల్లి నర్సిరెడ్డి,నాగరాజు, మెండే సైదులు, బైకానీ లక్షయ్య, సల్ల అంజరెడ్డి, తుమ్మల పల్లి సుధాకర్ రెడ్డి,మెగావత్ దశరథ నాయక్,రమావత్ శంకర్ నాయక్ భక్తులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు సిద్ధం కావాలి

- సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి

**నవతెలంగాణ-దేవరకొండ**



రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు సిద్ధంకావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో సిపిఐ దేవరకొండ నియోజకవర్గ మండలాల కార్యవర్గ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థలైన ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో అధిక స్థానలలో పోటీచేసి ప్రజా సమస్యల పరిష్కారంలో ముం దుండాల న్నారు.ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ఎర్రజెండా గ్రామ గ్రామానికి విస్తరించాలని కోరారు. నియోజకవర్గానికి సాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ సర్వే బిసి కులగణనతోపాటు 30ఏండ్ల సుదీర్ఘ పోరాటమైన ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ అసెంబ్లీలో చేసిన ఆమోదాన్ని స్వాగతిస్తు న్నామని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్లో చట్టం చేసి వర్గీకరణ న్యాయం చేయాల న్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రజలకు ఎంత మాత్రం ప్రయోజనం జరగలేదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రైతు బంధు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు సంక్షేమ పథకాలు ఇచ్చే ప్రక్రియ వెంటనే చేపట్టి అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. ఉప్పునూతల వెంకట య్య అధ్యక్షతన సమా వేశంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గసభ్యులు బొడ్డుపల్లి వెంకట రమణ, మండల కార్యదర్శులు తూం బుచ్చిరెడ్డి, ఎండీ మైనోద్దీన్, పోలె వెంకటయ్య, కుంభం జయరాములు, బొమ్ము అచ్చయ్య, యాసాని పాండురంగ రెడ్డి,నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### ట్రంప్ నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలి

**నవతెలంగాణ-హుజూర్‌నగర్**

భారతీయుల పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు భారతదశంలో ఉన్న అన్ని రాజకీయ పక్షాల నాయకులు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి శీతల రోశపతి అన్నారు. సరియైన అనుమతులు లేకుండా నివసిస్తున్న వారిని భారతదేశం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వారిని తిరిగి భారతదేశానికి పంపే విధంగా చర్యలు తీసుకోవాలి తప్ప యుద్ధ ఖైదీల్లా, ఉగ్రవాదుల కంటే దారుణంగా క్రూరంగా వ్యవహరించడం సిగ్గుచేటైన విషయం అన్నారు. ఈ వ్యవహారంపై భారత ప్రధాని మోడీ మరియు కేంద్ర ప్రభుత్వ నోరు మెదపకపోవడం దుర్మార్గమైన విషయం అన్నారు. ఎన్నో ఆశలతో ఆస్తులు అమ్ముకొని అమెరికా వెళ్తే భారతీయుల చేతులకు కాళ్లకు బెడిలేసి తిరిగి పంపిస్తున్న రోనాల్డ్ ట్రంప్ నిర్ణయం సరైంది కాదని దురదృష్టకరమని ఇది ప్రపంచమంతా వీక్షిస్తుందన్నారు. అమెరికాకు తమ నిరసనను తెలియజేయాలన్నారు. అవసరమైతే భారత్ నుండి విమానాలు పంపి భారతీయులని స్వదేశానికి క్షేమంగా తీసుకురావాలని కోరారు. మళ్లీ బ్రిటిష్ సామ్రా జ్యం అరాచకాలు ప్రస్తుతం గుర్తుకొచ్చేలా పరిపాలన కొనసాగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చత్తీస్గడ్‌లో నక్సలైట్ పేరుతో ఆదివాసులను దారుణంగా ఊచ కోత కోయటం సరి అయింది కాదన్నారు.ఈ కార్యక్ర మంలో పోయిన వెంకన్న యాదవ్, కంకనాల రామయ్య, శ్రీను, గణేష్, రాజు పాల్గొన్నారు.



### కబేళాలకు తరలిస్తున్న గోవుల పట్టివేత

**నవతెలంగాణ-కొండమల్లేపల్లి**

అక్రమంగా కళేబారాలకు తరలిస్తున్న గోవులను పట్టుకొని గోశాలకు తరలించినట్లు కొండమల్లేపల్లి ఎస్సై రామ్మూర్తి మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కొండమల్లేపల్లి మండలపరిధిలోని చింతచెట్టుతండా గ్రామ పరిధిలోని జేత్య తండా నుండి మంగళవారం తెల్లవారు జామున బొలెరోవాహనంలో ముగ్గురు వ్యక్తులు 10 గోవులను తరలిస్తుండడంతో వాహనాన్ని పట్టుకున్నారు.గోవులను తరలి స్తున్న హనుమంతు, గణేష్, జహంగీర్‌పై కేసు నమోదు చేసి ,గోవులను వెల్దండ గోశాలకు తరలించినట్లు తెలిపారు.

### నిక్షయ్ శివిర్ కార్యక్రమం విజయవంతం

**నవతెలంగాణ-మఠంపల్లి**

జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమములో భాగంగా మండలంలోని పెద్దవీడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 100 రోజుల నిక్షయ్ శివిర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ప్రాథమిక వైద్యాధికారి సుధాకర్ నాయక్ తెలిపారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 2030 వరకు క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి అనుమానిత వ్యక్తికి ముందస్తుగా తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గతంలో చికిత్స చేయించుకున్న వారి కుటుంబీకులు, షుగర్ వ్యాధి గ్రస్తులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, పొగ త్రాగడం అలవాటు ఉన్నవారు, కార్పెంటర్ పని చేస్తున్నవారు తప్పనిసరిగా ముందస్తు పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ప్రభాకర్, సూపర్వైజర్ రవి, నాగేంద్రమ్మ, హుజుర్నగర్ టీబి యూనిట్ సూపర్వైజర్ మమత, ఎంఎల్ హెచ్‌పి ఆదిలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, ఏఎన్ఎం సీతమ్మ, ఆరోగ్య సహాయకులు శ్రీనివాస్, భాస్కర్, జిల్లా టీబి యూనిట్ కో ఆర్డినేటర్ ప్రసాద్, డిఈఓ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డిప్యూటీ తహసీల్దార్‌గా కె.చంద్రశేఖర్

**నవతెలంగాణ-మర్రిగూడ**



మండల డిప్యూటీ తహసీల్దార్‌గా కే.చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నల్గొండ ఆర్డీవో కా ర్యాలయం నుండి మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్ బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ స మస్యలు, పెండింగ్ దరఖాస్తుల పరి ష్కారానికి కృషి చేస్తానన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్**

మండల పరిధిలోని ఏనుబాముల శివారు సంతోషి మాత ఆలయం సమీపంలో సూర్యాపేట నుండి నెమ్మికల్ వైపు వస్తున్న ఆటో అతివేగం కారణంగా అదుపుతప్పి చెట్టుకు ఢీకొని ఒకరు మృతి చెందగా ఇద్దరికీ తీవ్ర గాయాలయిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏనుబాముల గ్రామానికి చెందిన వర్రె మల్లమ్మ, గొర్రె పార్వతమ్మ తమ బంధువుల దశ దినకర్మకు సూర్యాపేట మండలం ఆరెగూడెంకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తూ సూర్యాపేట నుండి తమ స్వగ్రామం వచ్చేందుకు నెమ్మికల్‌కు చెందిన మోరపాక వెంకన్న ఆటో ఎక్కారు. మరో రెండు నిమిషాల్లో తమ గ్రామం ఏనుబాముల స్టేజి వద్ద ఆటో దిగాల్సి ఉండగా ఆటో చెట్టుకు ఢీ కొట్టడంతో వర్రె మల్లమ్మ(70) అక్కడికక్కడే మృతి చెందగా.. వర్రె పార్వతమ్మకు, ఆటో డ్రైవర్ మోరపాక వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించగా మృతి చెందిన మల్లమ్మను పోస్టుమార్టం కోసం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. మృతురాలు మల్లమ్మ కుమారుడు వర్రె రామన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మృతురాలు మల్లమ్మకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

### వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**నవతెలంగాణ-నార్కట్‌పల్లి**

మండలంలోని గోపలాయపల్లి గ్రామంలోని శ్రీవారిజాల వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు నేటినుండి ప్రారంభంకానున్నాయి. బుధవారం ఉదయం 10:30 నిమిషాలకు స్వామి వారి కల్యాణంతో ప్రారంభమై 15-02-2025 శనివారం రాత్రి 7:00 గంటలకు రథోత్సవం16-02-2025 ఆదివారం రాత్రి 8:00 గంటలకు ధోపోత్సవంతో ముగుస్థాయని దేవస్థాన సభ్యులు తెలిపారు.

### ఆశ్రమంలో అన్నదానం చేసిన ప్రభాకర్ హీరాబాయి దంపతులు

- ఫెయిత్ బంజారా ఆశ్రమంలో అన్నదానం

**నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్**

పట్టణానికి చెందిన సిహెచ్.లక్ష్మణ్ వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు ప్రభాకర్ హీరాబాయి దంపతులు మంగళవారం పట్టణంలోని ఫెయిత్ బంజారా ఆశ్రమంలోని చిన్నారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్, చిన్నారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## హరితహారం మొక్కల ఆనవాలు లేకుండా క్రీడల కోసం చెట్ల తొలగింపు

- నీడనిచ్చే చెట్లు నేలపాలు
- చెట్ల తొలగింపు పై గ్రామస్తుల ఆగ్రహం
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మఱ్రిగూడ

మండలంలోని వట్టిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 372లో జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి 3.13 ఎకరాల భూమి ఉన్నది.గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2017 లో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆ భూమిలో సుమారుగా 500 మొక్కలను నాటారు.గత ఎనిమిది సంవత్సరాలలో ఆ మొక్కలు చెట్లుగా పెద్దవిగా మారాయి.గతవారం క్రితం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా విపిఎల్ మండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా క్రీడ మైదానం కోసం క్రీడల నిర్వాహకులు సర్వే నెంబర్ 372 లోని భూమి ఎంచుకొని అందులో ఉన్న హరితహారం చెట్లను జెసిబి సహాయంతో తొలగించారు.చెట్ల తొలగింపు పై గ్రామస్తులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు పర్మిషన్ లేకుండా చెట్లను ఎలా తొలగిస్తారని ప్రశ్నిస్తున్నారు.మండల కేంద్రానికి అనుకొని ఉన్న గ్రామము పైగా ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఆ గ్రామానికి ఆనుకొని ఉండటంతో అధికారులు సైతం కొంతమందితో మమేకమై వీస్తూ పోతున్నారని అధికారులు తీరుపై గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మండల కేంద్రానికి అనుకొని దాదాపు మూడెకరాల భూమి ఒక వెంచర్ మాదిరిగా ఏర్పడడంతో కబ్జాకోరులు సైతం కన్నేసే ప్రమాదం ఉందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.ఆలస్యం చేయకుండా తక్షణమే అధికారులు చెట్లను తొలగించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి వంశీ ని వివరణ కోరగా చెట్ల తొలగించిన విషయం ఆలస్యంగా తమకు తెలిసిందని.విషయాన్ని ఎంపీడీవోకు తెలియజేయడం జరిగిందని ఎంపీడీవో ఆదేశానుసారం పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## దళిత ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

**కాంగ్రెస్ సేవాదల్ నియోజకవర్గం అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు**

నవతెలంగాణ-నూతనకల్

నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి నేటి వరకు ప్రతి కార్యకర్తతో మమేకమై నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న దళిత శాసనసభ సభ్యులు మందుల సామెల్‌పై అగ్రకుల నేతలు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షులు సేవాదళ్ పాల్వాయి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఆయన సంప్రదించకుండానే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులమని చెప్పుకుంటూ అగ్రకుల నాయకుల ఆదరాభిమానుల కోసం, శాసనసభ సభ్యులు సభ్యులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసే వ్యక్తులకు పార్టీ పదవులను స్థానిక ఎమ్మెల్యే అందించడం జరుగుతుందని, అది తెలియకుండానే నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెత్తనం చెల్లదని ఆయన సంతకం చెల్లదని పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తూ దళిత ఎమ్మెల్యే పై విషం చిమ్ముతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమ నాయకులు స్థానికుడైన సామెల్ కు కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఇస్తే ప్రజలు నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీని ఇచ్చి ఆదరించిన తీరును అగ్రవర్ణ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు., అక్రమ సంపాదనలకు అలవాటు పడి కొద్ది మంది ఎమ్మెల్యే పై చేస్తున్న ఆరోపణలు ఇకనైనా మానుకోకుంటే యావత్ దళిత జాతి తరపున తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

### అట్టహాసంగా ముగిసిన కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల ప్రకారం మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా నార్కట్పల్లి మండలంలోని యువతకు నిర్వహించిన కబడ్డీ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిసాయి ఈ సందర్భంగా విజేతగా నిలిచిన జట్టుకు బహుమతులు ప్రధానం చేసి ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను మండల స్థాయి నుంచి డివిజన్ స్థాయికి ఎంపిక చేసినట్లు స్థానిక ఎస్సై డి క్రాంతికుమార్ తెలిపారు.

## అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ చాలీసా

నవతెలంగాణ-చిలుకూరు

మండల కేంద్రంలోని కాలవొడ్డున గల ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం దాతల సహకారంతో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిలుకూరు గ్రామానికి చెందిన అలస కాని శ్రీను పద్మావతి దంపతుల వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదాన కార్యక్రమం కొల్లు సత్యనారాయణ లక్ష్మి దంపతుల సహకారంతో హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి ఆచార్య రజనీకాంత్ ఆలయ కమిటీ చైర్మన్ కోడారు వెంకటేశ్వర్లు మాధవరపు లక్ష్మయ్య గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడ్రన్ దోబీఘాట్‌లను పూర్తి చేయాలి

- రజక వృత్తిదారుల జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేబోయిన వెంకటేశ్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న మోడ్రన్ దోబీఘాట్లకు రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా నిధులు కేటాయిస్తూ, నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని, రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వడ్డబోయిన వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆలేరు మండలకేంద్రంలో మంగళవారం ఆ సంఘం ఆలేరు కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఎన్నికలలో రజకులకు ఇచ్చిన హామీలన్నిటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.ఈ సందర్భంగా



వడ్డెబోయిన వెంకటేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం, ఆలేరు పట్టణంలో రెండు కోట్ల రూపాయల నిధులు కేటాయించి, మోడ్రన్ ధోబిఘాటులను ప్రారంభించి, అసంపూర్తిగా బేస్‌మెంట్, పిల్లర్ల వరకు నిర్మాణం చేసి అసంపూర్తిగా పనులను నిలిపివేశారన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో రజకులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అత్యంత వెనుకబాటులో ఉన్న సేవావృత్తులైన ఇల్లు లేనటువంటి రజకులకు మొదటి ప్రాధాన్యతగా బీసీఏ కోటలో ఇవ్వాలని కోరారు.జీవో నెంబర్ 2 ప్రకారం అమలవుతున్న ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన విద్యుత్ బకాయిలను, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌సంస్థకు చెల్లించి ఉచిత విద్యుత్తు పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు.వృత్తి చేసుకుంటూ చనిపోయిన వృత్తిదారులందరికీ రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వడ్డేమాన్ బాలరాజు, వృత్తిదారులు ఆలేటిబాలరాజ్,నమిలే బాలమణి, నమిలే కవిత,మఱ్రిపల్లి ప్రకాష్, వడ్డేమాన్ సత్తయ్య,గాజరాజుల లాలయ్య, వడ్డెమాను అశోక్ పాల్గొన్నారు.



## కాముడికి నెల ముందే వికసించిన మోదుగు పూలు

నవతెలంగాణ-మోటకొండూరు

ప్రకృతి రమణీయంగా విరబూసే మోదుగు పూలు కంటికి చూడగానే కనువిందు చేస్తూ మనస్సుకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండే పూలు ఎర్రని పూలు! ఇవి రోడ్డుకు ఇరువైపులా స్వాగతం పలుకుతూ ఎంతో సౌందర్యంతో ఉండే ఈ పూలను అగ్ని పూలు అని కూడా పిలుస్తారు. వీటిని చూడగానే మనకు ముందుగా గుర్తు వచ్చేది చిలుకముక్కు లాగే నారింజ వర్ణంలో చూపరులను కనువిందు చేస్తాయి. ఎంత చూసినా తనివి తీరదు వీటికి చాలా ప్రత్యేకత ఉంది. ఈ పూలు ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ఎర్రగా పూస్తాయి దీంతోనే వేసవి మొదలవుతుందని అర్థమవుతుంది. మోదుగు ఆకులన్ని రాలిపోయిన తర్వాతనే పూలు పూస్తాయి. ఈ పూలను హోలీ పండుగ రోజున ఎక్కువ గా వాడతారు. మానవుడికి ఎలాంటి హానీ తలపెట్టకుండా హోలీకి రంగుగా వారం ముందు నుండే ఈ పువ్వులను తెచ్చుకొని చల్లుకుంటారు.దీనిని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరుగా పిలుస్తుంటారు. కవులు సైతం మోదుగుపూల గురించి ఎంతో వర్ణించి చెప్పారు.ఈ చెట్టు ఇక్కడా.. అక్కడా అని కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న చెట్టు మోదుగు చెట్టు

### హోలీరంగుకు మోదుగుపూలనే వాడేవాళ్లం..

నా చిన్నతనంలో హోలీ పండుగ వస్తుందంటే మోదుగుపూల కోసం వెతికి ఎక్కడ చెట్టు కనపడితే అక్కడపూలను తెచ్చి నానబెట్టి దంచి రంగుగా తయారు చేసుకొని ఒకరిపై మరొకరం ఎంతో ఉత్సాహంతో చల్లుకునేవారం.దీంతో హాని కలగకపోయేది. కానీ నేడు ఆ సంస్కృతి సాంప్రదాయం కనబడకుండా పోయింది.కెమికల్‌రంగులతో అనారోగ్యాల బారిన పడుతున్నారు.నాటి సంప్రదాయాన్ని కొనసాగిద్దామని యువతను కోరుతున్నా.



## ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు

- వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకులు అహమద్ నదీమ్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు చేపట్టాలని వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకులు మరియు రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అహమద్ నదీమ్ అన్నారు.మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టే ఆర్జాల భావి వద్ద ఉన్న గోదామును తనిఖీ చేసి ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్లతో సమీక్షించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టాలని, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ విషయంలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతల సమస్య రాకుండా చూడాలని జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ ను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి తాను మరోసారి ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించడం జరుగుతుందని, ఈ లోగా ఓట్ల లెక్కింపు కేంద్రంలో అన్ని వసతులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలనకై వచ్చిన ప్రిన్సిపల్ సెక్రెటరీ అహమద్ నదీమ్ కు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, అదనపు కలెక్టర్, ఇంచార్జి డిఆర్ఓ, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్ లు పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు.అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్చార్జి డిఆర్ఓ వై .అశోక్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ శివరామిరెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు :తహసీల్దార్

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణ శివారులోని ప్రభుత్వ భూములకు తహసీల్దార్ ఎస్. హరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ చేశారు. మండలంలోని చింతపల్లి రెవిన్యూ గ్రామ శివారు నార్కట్‌పల్లి - అద్దంకి బై పాస్ రోడ్డు సమీపంలో సర్వే నంబర్ 626లో సుమారు 4.06ఎకరాల ప్రభుత్వ భూమికి సిమెంట్ దిమ్మెలు పాతి వాటికి జిఐ బార్బ్ డ్ వైరుతో ఫెన్సింగ్ చేశారు. అదేవిధంగా సర్వే నంబర్ 1 లో 440 చదరపు గజాల భూమిపై హెచ్చరిక బోర్డు పెట్టారు. బోర్డుపై ప్రభుత్వ భూమిలోకి చొరబడితే, ఆక్రమిస్తె చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే విధంగా ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ చేసి రక్షిస్తామని తహసీల్దార్ అన్నారు. ఆయన వెంట రెవిన్యూ ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ, టీ. రామకృష్ణలున్నారు.